# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 9-1-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 141 పేజీలు: 8 వెల: రూ.1/-


## ఇరాన్ అణుకేంద్రం వద్ద భూకంపం

తెహ్రాన్,జనవరి8(ఆర్ఎన్ఎ): ఇరాన్‌లోని బుషెహ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌కు సమీపంలో రెండు వారాల వ్యవధిలోనే మరోసారి భూకంపం సంభవించింది. బుధవారం ఉదయం స్వల్పంగా భూమి కంపించినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే అధికారులు వెల్లడించారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.9గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. గతేడాది డిసెంబర్ 27న ఉదయం 5:23 గంటలకు భూకంపం సంభవించిన విషయం విదితమే. నాడు భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.1గా నమోదైంది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 5కు పైగా నమోదైతే గణనీయమైన నష్టం సంభవించే అవకాశం ఉంటుంది. కానీ బుషెహ్ న్యూక్లియర్ ఎ÷-లాంట్ చాలా బలమైన భూకంపాలను తట్టుకునేలా రూపొందించబడింది. ఇరాన్‌లోని చారిత్రాత్మక నగరమైన బామ్‌లో 2006లో భూకంపం వచ్చింది. 6.6 తీవ్రతతో సంభవించిన భూకంపానికి 26 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. బామ్ నగరం బుషెహ్ ఎ÷-లాంట్‌కు దగ్గరగా ఉన్నప్పటికీ నాడు ఎలాంటి దెబ్బతినలేదు న్యూక్లియర్ పవర్ ఎ÷-లాంట్.

### ఇరాక్, అమెరికా మధ్య..యుద్ధ మేఘాలు

# అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ మెరుపు దాడి

## ఇరాన్ క్షిపణి దాడుల్లో 80మంది మృతి?

- ఇరాన్ తీరును తీవ్రంగా ఖండించిన ట్రంప్
- సరియైన సమయంలో బదులిస్తామన్న అమెరికా రక్షణ శాఖ

బాగ్దాద్, జనవరి8(ఆర్ఎన్ఎ) : అమెరికాపై ఇరాన్ ప్రతీకార దాడికి దిగింది. ఇరాక్‌లోని రెండు అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ బలగాలు క్షిపణులతో దాడికి దిగాయి. ఇరాక్‌లోని అమెరికా ఎయిర్‌బేస్ లక్ష్యంగా ఈ దాడులు జరిపింది. పశ్చిమ ఆసియా నుంచి అమెరికా తన బలగాలను వెనక్కి తీసుకోవాలని ఇరాన్ హెచ్చరించింది. ఇరాక్‌లోని ఆల్ అనద్, ఇర్బిల్ ఎయిర్‌బేస్‌లపై డజనుకుపైగా క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది. ఈ దాడిలో అమెరికా సైనికులకు జరిగిన నష్టంపై ఇంకా స్పష్టత రాలేదు. ఎయిర్‌బేస్‌లపై దాడిని పెంటగాన్ ధ్రువీకరించింది. దాడిలో జరిగిన నష్టంపై అమెరికా అంచనా వేస్తోంది. ఇరాన్ క్షిపణి దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖండించారు. తాజా పరిస్థితులపై ట్రంప్ స్వయంగా సమీక్షిస్తున్నారని, సరైన సమయంలో బదులిస్తామని అమెరికా రక్షణశాఖ ప్రకటించింది. దాడులపై పూర్తి నివేదికను ట్రంప్‌కు సమర్పించామని, ఆయన తదుపరి చర్యలు తీసుకుంటారని వైట్ హౌస్ వెల్లడించింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తీవ్ర రూపం దాల్చే పరిస్థితి కనిపిస్తోంది.

ఇరాక్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ చేసిన క్షిపణి దాడుల్లో 80 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు దాడుల్లో కనీసం 80 మంది 'అమెరికా ఉగ్రవాదులు' మృతిచెందారని ఇరాన్ అధికారిక టీవీ పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మిలిటరీ కమాండర్ ఖాసీం సులేమానీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ ఈ క్షిపణి దాడులు చేపట్టింది. ఇరాక్‌లోని అల్ అసద్, ఇర్బిల్ ఎయిర్‌బేస్‌లపై క్షిపణులతో విరుచుకుపడింది. మొత్తం 15 క్షిపణులతో దాడి చేశామని, అన్ని మిసైల్స్ లక్ష్యాన్ని చేరుకున్నాయని ఇరాన్ మీడియా పేర్కొంది. అమెరికా హెలికాప్టర్లు, మిలిటరీ పరికరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయని వెల్లడించింది. ఈ సందర్భంగా వాషింగ్టన్‌కు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ప్రతీకార చర్యలకు దిగితే మరో 100 ప్రాంతాలను లక్ష్యాలుగా చేసుకుంటామని హెచ్చరించింది. మరోవైపు 22 క్షిపణులతో దాడి జరిగినట్లు ఇరాక్ మిలిటరీ చెబుతోంది. ఈ దాడుల్లో ఇరాక్ పౌరులెవరూ చనిపోలేదని వెల్లడించింది.

### అంతా బాగానే ఉంది - ట్రంప్

మరోవైపు ఇరాన్ క్షిపణి దాడుల తర్వాత అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్విటర్ వేదికగా స్పందించారు.

ప్రస్తుతానికి అంతా బాగానే ఉందని, తాజా పరిస్థితులపై కొంత సమయం తరువాత ప్రకటన చేస్తానని వెల్లడించారు. ఆల్ ఈజ్ వెల్.. ఇరాక్‌లోని రెండు సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఈ ఘటనల్లో ఎంతమంది చనిపోయారు..? ఎంత నష్టం జరిగిందనేది అంచనా వేస్తున్నామని ట్రంప్ తెలిపారు. ఇప్పటివరకు అంతా ఓకే అని, ప్రపంచవ్యాప్తంగా మాకు శక్తిమంతమైన, సమర్థమైన సైనిక బలగం ఉందని అన్నారు. బుధవారం ఉదయం(అమెరికా కాలమానం ప్రకారం) దీనిపై నేను ప్రకటన చేస్తామని ట్రంప్ ట్వీట్ చేశారు.

### వైట్‌హౌస్‌లో హైఅలర్ట్..

ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో అమెరికా దేశంలోని వాషింగ్టన్ నగరంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసముంటున్న వైట్‌హౌస్‌లో హైఅలర్ట్ ప్రకటించారు. ఇరాన్ అగ్రశ్రేణి సైనిక జనరల్ ఖాసిం సులేమానీని అమెరికా హతమార్చడంతో నిప్పులు చిమ్ముతున్న ఇరాన్... తాజాగా డొనాల్డ్ ట్రంప్‌ను చంపి తెస్తే 80 మిలియన్ డాలర్ల (రూ 575.44 కోట్లు) నజరానా ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ నివాసమైన వైట్‌హౌస్‌లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అమెరికా లా ఎన్ ఫోర్స్‌మెంట్ వెల్లడించింది. ఇరాన్ హెచ్చరికల దృష్ట్యా వైట్‌హౌస్ చుట్టుపక్కల భద్రతా బలగాలను మోహరించారు. వైట్‌హౌస్ సమీపంలోని చెక్ పాయింట్లలో అమెరికా సీక్రెట్ సర్వీస్ అధికారులు, సాయుధ భద్రతా బలగాలు పహరాను పటిష్ఠం చేశారు. అమెరికాలో తాము మిస్సైల్ దాడులు చేస్తామని హెచ్చరించిన నేపథ్యంలో అమెరికాలోని ట్రంప్ నివాసమైన వైట్‌హౌస్‌లో భద్రతను పెంచారు. డొనాల్డ్ ట్రంప్ నివాసముంటున్న వైట్‌హౌస్‌లో భద్రత పెంపుపై అమెరికా సీక్రెట్ సర్వీస్ అధికారులు వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు.

### అగ్రరాజ్యానికి ఇరాన్ దెబ్బ రుచి చూపాం

## జోలికి వస్తే ఊరుకునేది లేదు

**మాచేతులు నరికితే.. మీ కాళ్లు నరికాం**

### సైనిక స్థావరాలపై దాడి తరవాత ఖమేనీ ప్రకటన

టెహ్రాన్,జనవరి 8(ఆర్ఎన్ఎ): అగ్రరాజ్యం అమెరికాకు చెంప దెబ్బ రుచి చూపించామని ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ తెలిపారు. ఇరాక్‌లో ఉన్న రెండు అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేసిన అనంతరం ఖమేనీ జాతిని ఉద్దేశించి మాట్లాడారు. ఇరాక్‌లో ఉన్న అమెరికా సైనికులంతా దేశాన్ని విడిచి వెళ్లాలన్నారు. మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక దళాలు అవినీతికి మూలంగా మారాయన్నారు. అమెరికాను మేం శత్రువుగా భావిస్తామని ఖమేనీ అన్నారు. కమాండర్ సులేమానీని హత్య చేసి కుద్స్ ఫోర్స్ చేతిని అమెరికా నరికి వేసి ఉంటుంది, కానీ మధ్యప్రాచ్యంలో అమెరికా కాళ్లను మేం నరికివేస్తామని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రోహానీ తెలిపారు. ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి అలీ రాబేయీ అమెరికా సైనిక స్థావరాలపై దాడి చేసినందుకు రెవల్యూషనరీ గార్డ్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'మీ మాట నెరవేర్చుకున్నారని' ప్రశంసించారు. క్షిపణి దాడులను సమర్థించుకున్న ఆయన 'మేం యుద్ధం కోరుకోవడం లేదు. కానీ మళ్లీ ఏదైనా దాడి జరిగితే, దానికి మరింత గట్టిగా సమాధానం ఇస్తాం' అన్నారు. ఇదిలావుంటే మిసైల్ దాడులపై పెంటగాన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ పదికి పైగా బాలిస్టిక్ మిస్సైళ్లను అమెరికా సైన్యం, ఇరాక్ సంకీర్ణ సేనలపైకి ప్రయోగించింది. ఈ మిస్సైళ్లను ఇరాన్ నుంచి ప్రయోగించారన్నది సుస్పష్టం. అల్-అసద్, ఇర్బిల్ అమెరికా, సంకీర్ణ దళాలు ఉన్న రెండు సైనిక స్థావరాలపై పడ్డాయి. ఈ దాడిలో జరిగిన ప్రాథమిక నష్టాన్ని మేం అంచనా వేస్తున్నామని ప్రకటించింది. ఇరాన్ బెదిరింపులు, చర్యలకు స్పందనగా రక్షణ శాఖ మా సైనికులను, మా భాగస్వాములను కాపాడ్డానికి అన్ని తగిన చర్యలూ తీసుకుంది. ఆ ప్రాంతంలోని మా దళాలపై దాడి చేయడానికి ఇరాన్ ప్రణాళికలు సిద్ధం చేస్తోందనే సూచనలతో, ఆ ప్రాంత భద్రత కోసం మేం అక్కడివారిని అప్రమత్తం చేశామని పేర్కొంది. 'దీనికి స్పందనగా పరిస్థితిని అంచనా వేస్తున్న మేం, మా దళాలను, మా భాగస్వాములను, ఆ ప్రాంతంలోని మిత్రదళాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని తెలిపింది. ఈ అంశాన్ని పెద్దది చేయాలని అనుకోవడం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి జావేద్ జారిఫ్ ట్వీట్ చేశారు. ఇరాన్ 'ఇది తీవ్రంకావాలని, యుద్ధాన్ని కోరుకోవడం లేదు. కానీ ఎలాంటి దూకుడు చర్యలకు పాల్పడ్డా మమ్మల్ని మేం కాపాడుకుంటాం'

### ఇరాన్‌లో కూలిన ఉక్రెయిన్ విమానం..

# 170 మంది మృతి

- అధికారికంగా ప్రకటించిన ఉక్రెయిన్
- విమాన సంస్థలు, ప్రయాణికులకు భారత్ కీలక సూచన
- అత్యవసరమైతే తప్ప ఇరాక్‌ను వెళ్లొద్దని సూచించిన భారత్

టెహ్రాన్, జనవరి 8(ఆర్ఎన్ఎ) : రాజధాని టెహ్రాన్ సమీపంలో ఉక్రెయిన్‌కు చెందిన విమానం కుప్పకూలిపోయింది. ఉక్రెయిన్ నుంచి 180 మంది ప్రయాణికులతో ఇరాన్‌కు వస్తున్న బోయింగ్ 737 విమానం టెహ్రాన్‌లోని ఇమామ్ ఖయోమి అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో కూలిపోయినట్టు స్థానిక మీడియా తెలిపింది. బుధవారం ఉదయం తర్వాత ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పేర్కొంది. టెహ్రాన్ విమానాశ్రయంలో విమానం దిగుతుండగా సాంకేతిక లోపం తలెత్తి కూలిపోయినట్టు వివరించింది. ఉక్రెయిన్ అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 విమానం 169 మంది ప్రయాణికులు, 10 సిబ్బందితో కీవ్ వెళ్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ప్రయాణికుల సహా సిబ్బంది మొత్తం 170 మంది మృతిచెందినట్టు ఉక్రెయిన్ అధికారికంగా ప్రకటించింది. విమానం కూలిపోయిన దృశ్యాలను కొందరు సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. గాల్లో ఉండగానే విమానానికి నిప్పంటుకున్నట్లు వీడియో ఫుటేజ్‌లో స్పష్టమవుతోంది. అమెరికా సైన్యం 1988లో జరిపిన బాంబు దాడిలో 290 మంది ఇరానియన్లు మృతి చెందారని, దీని తర్వాత ఏం జరిగిందో ఆ దేశం గుర్తుంచుకోవాలంటూ ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ హెచ్చరిస్తూ ట్వీట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకుంది. 1988 జులై పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్‌కు చెందిన విమానాన్ని అమెరికా నావికాదళం ప్రమాదవశాత్తు కూల్చివేయగా, 290 మంది మృతి చెందారు.. ఈ సంఖ్యను అమెరికా గుర్తుంచుకోవాలి.. ఎప్పుడూ బెదిరింపులకు పాల్పడకూడదంటూ రౌహానీ ట్వీట్ చేయడం గమనార్హం. ఇరాన్ విమానాన్ని కూల్చివేసిన ఆరు నెలల తర్వాత లాకోర్‌బీ తీవ్రవాదులు అమెరికా విమానాన్ని స్కాట్లాండ్‌లో 1988 డిసెంబరులో బాంబులతో కూల్చేశారు. ఈ ఘటనలో 270 మంది చనిపోయారు. అయితే లాకోర్‌బీ ఉగ్రవాదాలు కూల్చేశారని నిర్ధారించినా ఇది ఇరాన్ ప్రతీకారంగానే విదేశీ గూఢచారులు నమ్ముతారు. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు ట్వీట్ చేసిన గంటల్లోనే ఉక్రెయిన్ విమానం కూలిపోవడం అనుమానాలకు రేకెత్తుతున్నాయి.

### విమాన సంస్థలు, ప్రయాణికులకు భారత్ కీలక సూచన..

గతవారం బాగ్దాద్ విమానాశ్రయంపై అమెరికా సైన్యం రాకెట్ దాడులకు పాల్పడి ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సైన్యాధిపతి ఖాసిం సులేమానీని మట్టుబెట్టిన తర్వాత పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి.

తాజాగా, ఇరాక్‌లోని అమెరికా వైమానిక స్థావరాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. అల్ అసద్, ఇర్బిల్ ఎయిర్‌బేస్‌లపై డజనుకుపైగా క్షిపణులతో దాడిచేసింది. సులేమానీ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించిన నాలుగు రోజుల్లోనే ఈ దాడికి పాల్పడటం గమనార్హం. ఇరాన్‌తో చేసుకున్న అణు ఒప్పందం నుంచి వైదొలగిన అమెరికా.. మధ్య ఆసియాలో యుద్ధ విమానాలను మోహరిస్తామని 2019 మేలో ప్రకటించింది. అంతకు ముందే ఏప్రిల్‌లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించడం విశేషం. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోంది. తాజాగా సులేమానీ హత్యతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారి ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థలకు భారత్ సూచనలు జారీచేసింది.

ఇరాన్, ఇరాక్ సహా పర్షియన్ గల్ఫ్, ఒమన్ గగనతలం మీదుగా విమాన ప్రయాణాలు ప్రస్తుత పరిస్థితుల్లో సురక్షితం కాదని హెచ్చరించింది. ఇరాక్‌లో ప్రత్యేక పరిస్థితి నెలకున్నాయని, తదుపరి ప్రకటన వెలువడే వరకూ అత్యవసరమైతే తప్ప ఆ దేశానికి భారత పౌరులు తమ ప్రయాణాలు వాయిదావేసుకోవాలని విదేశాంగ శాఖ ప్రకటించింది. అలాగే ఇరాక్‌లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని, ఆ దేశంలో ప్రయాణించడం అంత క్షేమం కాదని ఓ ప్రకటనలో విదేశాంగ శాఖ వెల్లడించింది.



టెహ్రాన్ సమీపంలో కుప్పకూలి బుగ్గిగా మారిన ఉక్రెయిన్ విమానం

# ఆర్కిటెక్చర్ రంగంలో విస్తృత అవకాశాలు

**మన ప్రాచీన కట్టడాలు అద్భుత ఆర్కిటెక్ నిదర్శనాలు**

**జెఎన్‌యూ హెచ్ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై**

హైదరాబాద్,జనవరి8(ఆర్ఎన్ఎ): ఆర్కిటెక్చర్ రంగంలో విస్తృత అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ అన్నారు. భారత్‌లో ప్రాచీన కాలం నుంచే ఈ రంగం ఎంతగానో పురోగమించిందన్నారు. తమిలనాడు తంజావూర్ ఆర్కిటెక్చర్ అద్భుతాన్ని ఆమె వివరించారు. అక్కడ ఒకేరకం రాయితో చెక్కిన శిల్పసందర్యం, నీడపడని విషయాలు అర్కిటెక్చర్ అద్భుతాలకు నిదర్శనమన్నారు. శిల్పారామంలో జేఎన్టీయూ హెచ్ స్నాతకోత్సవం జరిగింది. ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్చర్ విద్యార్థులకు గవర్నర్ తమిళిసై పట్టాలు ప్రదానం చేశారు.

అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. సవాళ్లను ఎదుర్కోవడానికి, అవకాశాలు అందిపుచ్చుకోవడానికి యువత సిద్ధంగా ఉండాలి అని ఆమె సూచించారు. ఆర్కిటెక్చర్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి అని గవర్నర్ స్పష్టం చేశారు. కొన్ని శతాబ్దాలుగా నిలిచి ఉన్న నిర్మాణాలు మన నైపుణ్యం, ప్రతిభకు నిదర్శనాలు అని ఆమె చెప్పారు. తమిళనాడులోని పలు ఆలయాలు మన ఆర్కిటెక్చర్ ప్రతిభకు నిదర్శనమన్నారు. ఏకశిలపై నిర్మించిన అనేక ఆలయాలు, నిర్మాణాలు ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నాయి. చెన్నై బీచ్‌లో మన్రో విగ్రహం నేటికి అద్భుతంగా ఉంది అని గవర్నర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నతవిద్యామండలి కార్యదర్శి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారత పౌరులు అప్రమత్తంగా ఉండండి: కేంద్రం

న్యూఢిల్లీ,జనవరి8(ఆర్ఎన్ఎ): గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా భారత విమానయాన శాఖ అప్రమత్తమైంది. ఇరాక్, ఇరాన్‌తో పాటు గల్ఫ్ పరిధిలోని గగనతలంలోకి వెళ్లొద్దని భారత విమానయాన సంస్థలకు కేంద్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇరాక్ ప్రయాణాన్ని రద్దు చేసుకోవాలని భారతీయులకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఇరాక్‌లో పరిస్థితుల దృష్ట్యా ఇరాక్ ప్రయాణానికి దూరంగా ఉండాలని పేర్కొంది. ఇరాక్‌లో ఉన్న భారతీయులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఇరాక్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు స్థానికంగా ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించింది. ప్రయాణాలన్నీ వాయిదా వేసుకోవాలని భారత పౌరులకు విదేశాంగశాఖ సూచించింది. ఇరాక్‌లోని అమెరికా బేస్ క్యాంపులపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడిన నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ గల్ఫ్‌లోని భారతీయులకు హెచ్చరికలు జారీ చేసింది. గల్ఫ్, ఇరాన్, ఇరాక్‌ల మీదుగా ఎయిర్‌స్పేస్‌లను వాడకూడదని అమెరికా ఇప్పటికే నిషేధం విధించింది.

### వింగ్స్ ఇండియాలో పాల్గొనున్న కేటీఆర్

హైదరాబాద్,జనవరి8(ఆర్ఎన్ఎ): వింగ్స్ ఇండియా 2020 సదస్సుకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ క్రమంపై గురువారం ఢిల్లీలో వింగ్స్ ఇండియా 2020 సన్నాహక సమావేశం జరగనుంది. బేగంపేటలో మార్చి 12 నుంచి 15వ తేదీ వరకు వింగ్స్ ఇండియా సదస్సు నిర్వహించనున్నారు. వింగ్స్ ఇండియాలో భాగంగా నిర్వహించే ప్రపంచ వైమానిక సదస్సులో అంతర్జాతీయ వైమానిక రంగ భాగస్వామ్య కంపెనీలు, ప్రతినిధులు పాల్గొననున్నారు. ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ నిర్వహించే సన్నాహక సమావేశంలో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం వచ్చింది. సమావేశంలో కేటీఆర్ గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు.

## మళ్లీ మొరాయించిన మెట్రో ట్రైన్

**-అసహనం వ్యక్తం చేసిన ప్రయాణికులు**

హైదరాబాద్,జనవరి8(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లోని అమీర్‌పేట -రాయదుర్గం మార్గంలో మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడింది. సాంకేతిక కారణాలతో బుధవారం ఉదయం 9గంటల నుంచి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 9 మెట్రో ట్రైన్స్ పట్టాల పైనే నిలిచిపోయినట్టు సమాచారం. దీంతో అమీర్‌పేట్ స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. రోజూ లాగే మెట్రో స్టేషన్‌కు చేరుకున్న ఎంతోమంది ఐటీ ఉద్యోగులు అసహనంతో వెనుదిరిగారు. అయితే అధికారులు వెంటనే లోపాలను సరిచేయడంతో ప్రస్తుతం రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగించారు. గతంలోనూ సాంకేతిక సమస్యలతో మెట్రో రైళ్లు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. కొన్ని సందర్భాల్లో విద్యుత్ వైర్లు తెగిపడి, మరికొన్ని సందర్భాల్లో విద్యుత్ వైర్లపై ఫ్లెక్సీలు పడి రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉంటే, జేబీఎస్-ఎంజీబీఎస్ మెట్రో సేవలు సంక్రాంతికి ముందే అందుబాటులోకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. 11కి.మీ పొడవైన ఈ మార్గంలో ఇప్పటికే దాదాపుగా అన్ని పనులు పూర్తి కాగా.. ప్రస్తుతం ట్రయల్ రన్స్ నిర్వహిస్తున్నారు. గతేడాది నవంబర్ నుంచి నిర్వహిస్తున్న ట్రయల్ రన్స్‌పై అధికారులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ట్రయల్ రన్‌లో భాగంగా మొత్తం 17 రకాల టెస్టులు నిర్వహిస్తున్నారు. 45 రోజుల్లో ఇవన్నీ పూర్తి కానున్నాయి. చివరలో మూడు రోజులు కమిషనర్ ఆఫ్ మెట్రో రైల్ సేఫ్టీ (సీఎంఆర్ఎస్) ట్రయల్ రన్స్‌ను పరీక్షిస్తుంది. ఆ సంస్థ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే దీనిపై సంబంధిత సంస్థలకు,ప్రభుత్వానికి నివేదికలు అందజేయనున్నారు. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే నగరంలో మెట్రో 67కి.మీ మేర అందుబాటులోకి వచ్చినట్టవుతుంది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి సొంత ఊళ్లకు వెళ్లేందుకు జేబీఎస్,ఎంజీబీఎస్ వెళ్లే ప్రయాణికులకు ఈ మెట్రో సేవలు ఉపయోగపడనున్నాయి. దేశ రాజధానిలో ప్రస్తుతం 200కి.మీ మేర మెట్రో రైళ్ల సేవలు అందుబాటులో ఉండగా.. ఆ తర్వాతి స్థానంలో హైదరాబాద్ ఉండటం విశేషం.

## చరిత్రలో నేటినిజం



కం॥ హరగోవిందు ఖురానా
ధరపై చరియించి మంచి దార్శనికుండై
వరవరము దలచు కొనెన్
నరజాతికి సేవల నిడి నతులందు కొనెన్!!

(జనవరి 9 హరగోవిందు ఖురానా జననం)



-రాధశ్రీ

సెల్: 9494481210

## కాశ్మీర్‌లో వర్షానికి బాలికమృతి

శ్రీనగర్,జనవరి 8(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్‌లోని కతువా జిల్లాలో భారీ వర్షానికి ఓ ఇల్లు కుప్పకూలి పోయింది. ఈ ఘటనలో 14 ఏళ్ల మనీషా అనే బాలిక మృతి చెందగా..ఆమె తల్లి చంచలా దేవి (45), సోదరి శీలా దేవి(19)కి గాయాలయ్యాయి. రెస్క్యూ టీం శిథిలాల కింద ఇరుక్కుపోయిన తల్లీకూతుళ్లిద్దరిని బయటకు తీశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. జమ్మూ ప్రాంతంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. బిల్లావర్ తహసీల్ పరిధిలోని మల్హార్ గ్రామంలో ఈ ప్రమాదం జరిగింది.

## హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ వద్ద భారీ భద్రత

**సెక్యూరిటీ పెంచిన పోలీసులు**

**తనిఖీలు పెంచి అప్రమత్తం అయిన బలగాలు**

హైదరాబాద్,జనవరి 8(ఆర్ఎన్ఎ): ఇరాన్, అమెరికా దేశాల మధ్య దాడుల నేపథ్యంలో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయం వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. బేగంపేటలోని యూఎస్ కాన్సులేట్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులు బలగాలను మోహరించారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపిస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయం వద్ద భారీ భద్రత నేపథ్యంలో బేగంపేటలో ట్రాఫిక్‌కు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ఉదయం ఆఫీసులు, విద్యాసంస్థలకు వెళ్లేవారు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. రద్దీ సమయంలో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు నియంత్రించేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. కాగా, మన దేశం సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై డిసెంబర్ 31న ఇరాన్ మద్దతున్న హిజ్బుల్ బ్రిగేడ్ తీవ్రవాద సంస్థ మద్దతుదారులు దాడికి పాల్పడటంతో చిచ్చు రగిలింది. దీనికి ప్రతీకారంగా ఇరాన్ జనరల్ ఖాసీం సులేమానిని డ్రోన్ల సాయంతో క్షిపణి దాడులతో అమెరికా అంతమొందించింది.

## జ్వరంతో నిమ్స్‌లో చేరిన మంత్రి జగదీష్‌రెడ్డి

**- పరామర్శించిన కేటీఆర్, ఇతర నేతలు**

హైదరాబాద్, జనవరి 8(ఆర్ఎన్ఎ) : జర్వంతో అస్వస్థతకుగురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డిని బుధవారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్యంపై వాకబు చేసిన మంత్రి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, విప్ బాల్క సుమన్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వేమిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథం తదితరులు జగదీష్ రెడ్డిని పరామర్శించారు.

మంత్రి జగదీష్ రెడ్డి జ్వరం నుండి త్వరగా కోలుకోవాలని కోరుతూ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి గ్రామ టీఆర్ఎస్ నాయకులు మహాదేవ నామేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వల్లల సైదులు, రాపర్తి సైదులు, జెర్రిపోతుల యాదగిరి, సోమగాని లింగస్వామి, రాపర్తి మహేష్ కుమార్, చెరుకుపల్లి వెంకటలాల్, శ్రీనివాస్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌పై అభిప్రాయాలు చెప్పండి

**-ప్రజలను కోరిన ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,జనవరి8(ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్‌పై అభిప్రాయాలు చెప్పాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలను కోరారు. మరికొద్ది రోజుల్లో కేంద్రప్రభుత్వం బ్జడెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ప్రధాని ట్విటర్ ద్వారా విజ్ఞప్తి చేశారు.'130కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా కేంద్రం బ్జడెట్‌ను ప్రవేశపెట్టనుంది. 2020లో మా ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బ్జడెట్‌కు మీ సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను. త్వరలో ప్రవేశపెట్టనున్న బ్జడెట్ కోసం మీరు ఇచ్చే సలహాలను ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుంది' అని మోడీ ట్వీట్ చేశారు.

రైతులు, విద్య, ఇతర అంశాలకు సంబంధించిన సలహాలను ఎన్జ్రశీజ.అకు షేర్ చేయాల్సిందిగా మోడీ ట్వీట్‌ను ట్యాగ్ చేశారు. బ్జడెట్‌కు సంబంధించిన సలహాలు ఇవ్వాల్సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ గతంలోనే ప్రజలను కోరిన విషయం తెలిసిందే.






## అమ్మ

బాధ్యత నేర్పేది అమ్మ
నన్ను నడిపించేది అమ్మ
ఏడుస్తే కన్నీరు తుడిచేది అమ్మ
నాలో సగభాగం అమ్మ
ఏడుస్తే నవ్వించేది అమ్మ
అమ్మ అంటే అవని
అంతు లేని ధైర్యమిది
అమ్మ మాట అమృతం
అంతులేని ఆనందం
అమ్మ లేకుంటే లేదు నా జీవితం



**- జి. శ్రీజ**
7వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్, జి॥ ఆదిలాబాద్



## గురువు

దేవుడు లేనిదే సృష్టిలేదు
అమ్మలేనిదే జన్మలేదు
గురువులేనిదే జీవితమే లేదు.

గురుర్బ్రహ్మ గురువిష్ణు గురుదేవో
మహేశ్వర గురుసాక్ష పరబ్రహ్మ
తస్మై శ్రీ గురువే నమహః
గురువే ప్రత్యక్ష దైవం.

**- అప్పాస్ దివ్యవాణి**
10వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్, జి॥ ఆదిలాబాద్

## బడి

ఆనందాన్ని ఇచ్చేదే బడి
అద్భుతమైన చదువు నేర్పించే బడి
ఆడుకునేందుకు ఆసరయిన బడి
అద్భుతమైన అందాల మా బడి
అల్లరి చేసే బడి
అందరిని కాపాడేది బడి
చదువు నేర్పించే తల్లి మన బడి తల్లి
డబ్బు సంపాదించేదే బడి
అన్నం పెట్టేదే మన బడి
సాయం చేసేదే బడి
చాలా ఆనందాన్నిచ్చేదే బడి.

**- ఎస్. దీపిక**
7వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్
జి॥ ఆదిలాబాద్



## పల్లెయొక్క గొప్పదనం

మనకు ఆనందాన్ని కల్పించేది పల్లె
పట్నంలో ఉంటుంది విపరీతమైన కాలుష్యం
పల్లెల్లో ఉంటుంది విపరీతమైన అనుబంధం
పట్నంలో ఉన్న వాహనం నుంచి వస్తుంది
చెడు పెట్రోల్ వాసన
పల్లెలో వర్షం కురుస్తే వస్తుంది
మధుర సువాసన
పట్నంలో అమ్ముతారు
మందు చల్లిన కురగాయలు
పల్లెలో పండిస్తాము తాజా కూరగాయలు
పట్నంలో వినిపిస్తుంది వాహనాల శబ్ధం
పల్లెల్లో వినిపిస్తుంది మధుర గీతం
పట్నంలో ఉంటాయి వాహనాలు
పల్లెలో ఉంటాయి కోయిలలు.
పల్లె ఒక అందమైన నివాసం.

**- సి.హెచ్. సాయిప్రియ**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్, జి॥ ఆదిలాబాద్

## అమ్మ

అమ్మ అన్న మాట అమృతం కన్న మిన్న
ఆ బ్రహ్మను కన్న దేవత అమ్మ
అమ్మలోని మొదటి అక్షరానికి అర్థం అప్యాయత
రెండో అక్షరానికి అర్థం మమత
ఈ రెండు అక్షరాలు కలుపుతేనే అమ్మ
అమ్మ అంటే అవని
నీ చేతి గోరుముద్ద స్వర్గం
కంటికి రెప్పలా కాపాడుతుంటావు
నన్ను అనుక్షణం
నీ మాటే నాకు ఒక పూల మార్గం
అందుకే నీ మాట అమృతం
అంతులేని ధైర్యమిధి
అంతులేని ఆనందమిధి
అమ్మ లేకుంటే లేదు నా జీవితం
అందుకే నిన్ను పూజిస్తా అనుక్షణం.



**- జి. తేజశ్రీ**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్, జి॥ ఆదిలాబాద్

## చందమామ

చిన్న పిల్లలలకు అన్నం అవుతావు
అమ్మకు లాలిపాట అవుతావు
కవులకు కవితలవుతావు
రచయితలకు రచనవవుతావు
రాత్రి వేల వెలుగులవుతావు
చీకటి, వేల చల్లని గాలువవుతావు
చీకటిని తొలగిస్తావు నీవు
వెలుగును తీసుకువస్తావు నీవు
మామకు మామవు నీవు.



**- బి. అఖిల**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్
జి॥ ఆదిలాబాద్

## గురువు

మనల్ని సృష్టించింది అమ్మ నాన్న అయితే
మనకు జీవితాన్ని అందించింది గురువు
మనం తప్పుదారిన నడుస్తే
మనకి మార్గం చూపించేది గురువు
అమ్మ నాన్న మనకు గురువును పరిచయం చేస్తే
గురువు మనల్ని ప్రపంచానికి పరిచయం చేస్తాడు
ఆపై లోకంలో దేవుడు ఎంత గొప్పవాడో
ఈ భూలోకంలో గురువు అంత గొప్పవాడు
మన తలరాతలను రాసేది ఆ దేవుడైతే
మన తలరాతలను తీర్చిదిద్దేది ఈ గురువే
గురువును మించిన దైవం లేదు.



**- ఎన్. అఖిల**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్
జి॥ ఆదిలాబాద్

# బాల వికాసం

ఆదిలాబాద్ జిల్లా జైనాథ్ మండలంలోని కుర జడ్.పి.హెచ్.ఎస్. విద్యార్థులు రాసిన రచనలు ఈ వారం

-సంపాదకులు

## గురువు-దైవం

అమ్మ జన్మనిస్తుంది
నాన్న నడక నేర్పుతాడు.
గురువు జీవితాన్నేఏ నేర్పుతాడు
కనిపెంచడం అమ్మకు సాధ్యం
నడక నేర్పి బడికి పంపడం నాన్నకు సాధ్యం
కాని మనల్ని ఒక మంచిదారివైపు నడిపిస్తూ
ప్రయోజకులను చేయడం
ఒక గురువుకే సాధ్యం
దట్ ఈజ్ టీచర్
గురువును మించిన దైవం లేదు.



**- అప్పాస్ దివ్యవాణి**
10వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్, జి॥ ఆదిలాబాద్

## నాన్న

కన్నతల్లి లేకపోతే
రోడ్డుమీద ఎవరినైన
అమ్మ అని పిలిచే బందాన్ని
కలుపుకోవచ్చు కాని
నాన్న అనే పిలుపు
ఒక్కసారి దూరమయితే
ఆ పిలుపు ఎంత అరచినా
లాభం ఉండదు
గుండెలు బాధుకున్నా కూడా
ఆ పిలుపు దొరకదు.



**- ఎం.అనూష**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్
జి॥ ఆదిలాబాద్

## పట్టుదల

అనగనగా ఒక ఊరు..!

ఆ ఊరిలో లింగారెడ్డి అనే ఆయన దగ్గర వీరయ్య అనే ఒక పేదవాడు లేబర్‌గా పని చేసేవాడు.

అతని భార్య శాలిని. అతనికి ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు. వీరయ్య తన భార్య పిల్లల కడుపు నింపడానికి తను లింగారెడ్డి దగ్గర పనిచేసేవాడు. తన మొదటి కుమార్తె పేరు విజయ, రెండవ కుమార్తె పేరు అక్షయ. మూడవ కుమార్తె పేరు జయ. తన కుమారుడి పేరు ఓం.

వీరయ్య 5సం॥లు లింగారెడ్డి దగ్గర పని చేసి తన మొదట కూతురికి 80వేల కట్నంతో పెళ్లి చేశాడు.

తన రెండవ కూతురు అక్షయ అమ్మ, నాన్న కష్టాన్ని చూసి చదవక చేను పని చేసేది

కాని మూడవ కూతురు జయ మాత్రం 6 సం॥లకే బడికి వెళ్తానని మారం చేసింది. దాంతో వీరయ్య అన్నాడు.

నాకు చేతనయినంత వరకు చదివిస్తా బిడ్డా.. అని అన్నాడు. వీరయ్య జయను 7సం॥లకు ప్రభుత్వ పాఠశాలలో జయను చేర్పించాడు. జయ మొదటి తగరతి చదివి 2 తరగతికి వెళ్లింది. తన తరగతి పెరుగుతున్న కొలది తను స్కూల్ టాపర్ .,, 7వ తరగతి పూర్తి చేసింది. 8వ తరగతి చదువుదాం అంటే వీరయ్య వద్దన్నాడు.

తల్లీ నాకు, నిన్ను చదివించే స్తోమత నాకు లేదు తల్లీ అన్నాడు. కానీ జయ మొండిది. తాను చదివి తీరుతా అని మొండి పట్టుపట్టింది. పాఠశాలకు తను ఒక నెలపాటు వెళ్లలేదు. తాను ఒక్క నెలలో తన జీతంతో తాను 8వ తరగతి పుస్తకాల నుండి బ్యాగ్ వరకు తానే స్వయంగా కొనుక్కొని 10వ తరగతి పూర్తి చేసింది.

జయ 10వ తరగతి ఎస్ఎస్‌సి పరీక్షలో టెన్‌కి టెన్ పాయింట్స్ తెచ్చుకుంది. "జయ" ఇప్పుడు హైద్రాబాద్‌లో డాక్టర్‌గా పని చేస్తుంది.

తనకు నెలకు 80 వేల స్యాలరీని పొందుతూ తన తల్లిదండ్రులను తానే పోషించగల స్థాయికి జయ వెళ్ళింది.

కానీ డబ్బున్న వారు వారి అమ్మా, నాన్న చదివిస్తా అన్నా చదువుకోవడం లేదు.

**నీతి: మనం చదువకోగలం అనే పట్టుదల ఉంటే ఎంత పేదవారయినా ఎంత కష్టమయినా చదివి తీరగలుగుతాం.**



**- సి.హెచ్ సాయిప్రియ**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం॥ జైనథ్, జి॥ ఆదిలాబాద్

## మంచివారి స్నేహం

ఒక కాలువ ఒడ్డున ఒక చీమల పుట్ట ఉండేది. ఆ పుట్టలో ఎన్నో చీమలు నివాసం ఉండేది. దాహం తీర్చుకోవడానికి కాలువ దగ్గరకు ప్రతిరోజూ ఒక పావురం వచ్చేది. చీమలు ఆ పావురంతో స్నేహం చేయడం మొదలు పెట్టాయి. ఇలా కొన్ని రోజులు గడిచాయి. ఆ సంవత్సరం వర్షాలు బాగా కురిశాయి. చెరువులు నదులు పొంగి పొర్ల సాగాయి. చీమల పుట్ట దగ్గరలో ఉన్న కాలువ నిండా నీళ్ళు వచ్చాయి. వర్షాలు ఇంకా తగ్గలేదు. రోజు రోజుకి కాలువ నీటి మట్టం పెరిగిపోసా గింది. ఇలాగే సాగితే తమ పుట్ట నీళ్ళలో మునిగిపోయి తామంతా చచ్చిపోతామని భయపడసాగాయి చీమలు. ఆ రోజు మామూ లుగా అక్కడికి వచ్చిన పావురం చీమలు దిగులుగా ఉండటం చూసి ఏమైంది మిత్రులారా? రోజులా ఆడుతూ పాడుతూ సంతోషంగా లేరు అని అడిగింది. ఏం చెప్పమంటావు నేస్తం. మేము ఈ ప్రపంచంలో అన్నింటి కన్నా అల్పులమైన ప్రాణులం. గాలి వీచినా ఎండ కాసినా, వాన కురిసినా మాకు కష్టాలే. ఈ కాలువ నిండి నీళ్ళు బైటికి పొర్లితే మాకు ప్రమాదం. మేమంతా చచ్చిపోతాం. అని అన్నాయి మరి ఇక్కడి నుంచి దూరంగా వెళ్ళిపోతే మంచిది కదా! అందిపావురం. ఎక్కడికి వెళ్తాం. ఎలా వెళ్తాం! మా బంధువులు ఆ కాలువ అవతల ఉన్నారు. కాని అక్కడికి చేరుకోవడం ఎలా అని దిగులు చెందాయి. ఆ మరునాడు పావురం అక్కడికి వచ్చింది అక్కడ చీమల పుట్ట మునిగిపోయింది. చీమలు ఆకులపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నాయి. వెంటనే పావురం ఒక ఉపాయం చేసింది. చింతించకండి నేను మిమ్మల్ని అవతలి ఒడ్డుకు చేరుస్తాను. మీరంతా త్వరగా వచ్చి నా మీద ఎక్కండి అంది. చీమలు పావురం మీదకు ఎక్కి కూర్చున్నాయి. పావురం నెమ్మదిగా చాలా జాగ్రత్తగా ఎగురుతూ కాలువకు అవతలివైపుకు వెళ్ళింది. దూరంగా ఎక్కడో ఉన్న చీమల బంధువులను వెతికి మరీ వాటికి అక్కడికి చేర్చింది. పావురం చేసిన సహాయానికి చీమలు కృతజ్ఞతలు తెలుపుకున్నాయి.

**నీతి: మంచి వారితో స్నేహం ఆపదల నుంచి రక్షిస్తుంది.**



## అన్నా... చెల్లెలు



అనగనగా ఒక ఊరిలో ఒక పేదవాడు ఉండేవారు. అతనికి ఒక అక్క ఉండేది. ఆ పేదవాడి పేరు రంగయ్య. తన అక్క పేరు లక్ష్మి. ఆమెకు ఒక కూతురు పుట్టింది. ఆ సందర్భంలో తన అన్న ఒక 3 ఎకరాల పొలం కొని అందులో పంట పండించాలి. అని అనుకున్నాడు. అప్పుడు రంగయ్య తన భార్య ఆనంది దగ్గరకు వెళ్లి ఆనంది నీ బంగారు కమ్మలను తాకట్టు పెట్టి మనం 3 ఎకరాలు కొని అందులో పంటలు పండిద్దాం అని రంగయ్య అన్నాడు. ఏయ్! నీకు మతిపోయిందా ఇది మా అమ్మ, నాన్న నాకోసం ప్రేమతో కొన్నారు. ఆ వ్యవసాయాన్ని నమ్ముకొన్న నేను నా కమ్మలను తాకట్టు పెట్టలేను అని ఆనంది అంది.

రంగయ్యయకు ఏమీ తోచలేక అరుగు మీద కూర్చున్నాడు. అప్పుడు లక్ష్మీ వచ్చి ఏమైంది అనయ్య ఎందుకిలా దిగులుగా ఉన్నావు. అసలు ఏమైంది అప్పుడు రంగయ్య జరిగిందంతా చెప్పాడు. ఓ అదా విషయం. దానికే నువ్వు దిగులుగా ఉన్నావా. సరే ఇదిగో నా బంగారు గాజులు, కమ్మలు తీసుకొని నువ్వు 3 ఎకరాలు కొని అందులో పంట పండివ్వు అని అంది లక్ష్మి. లేదు చెల్లెమ్మ ఇది నీకు ఎంతో ఇష్టమైనవి అమ్మా,నాన్నల గుర్తుగా ఉంచుకుంటావు వద్దు అని రంగయ్య అన్నాడు. ఏంటి అన్నయ్య నేను నీకు ఇంత పరాయి దాన్ని అయ్యానా మనమిద్దరం రక్తం పంచుకు పుట్టిన వాళ్ళం. అని రంగయ్యతో లక్ష్మి అంది. సరే లక్ష్మి అని రంగయ్య ఆ బంగారు గాజులను, కమ్మలను తీసుకొని ఎవరైనా భూమిని అమ్ముతున్నారో అని వెతకసాగాడు.

అప్పుడు అక్కడ ఒక ధనవంతుడు ఉన్నాడు. రంగయ్య అక్కడికి వెళ్ళి అయ్యా నా దగ్గర కొంత డబ్బు ఉంది దానిని తీసుకొని నాకు 3 ఎకరాల భూమి ఇస్తారా అని రంగయ్య అన్నాడు. లేదు నీలాంటి పేదవానికి నా భూమిని అమ్మితే ఇంకా నా పరువు ఎలా ఉంటుంది లేదు నేను నీలాంటి పేదవానికి అమ్మను.

రంగయ్య అలానే దిగులుగా నడుస్తు ఉన్నాడు.అప్పుడు ఒక ముసలి అవ్వ వచ్చి "నాయనా నువ్వు వ్యవసాయం కోసం భూమిని కొనడానికి ప్రయత్నిస్తున్నావని తెలిసింది. నా దగ్గర 3 ఎకరాల భూముంది. కాని ముసలితనంతో వ్యవసాయం చేయలేకపోతున్నాను. సరే నా భూమి నీకు ఇస్తాను అంది అవ్వ. సరే అవ్వ ఇదిగో నీకు ఈ బంగారు గాజులు, కమ్మలు ఇస్తాను నీకు ఉపయోగపడతాయి అని రంగయ్య అని వెనక్కి లక్ష్మి దగ్గరకు వచ్చాడు. అప్పుడు రంగయ్య ఇలా లక్ష్మితో అన్నాడు. చెల్లెమ్మ చెల్లెమ్మ నాకావాల్సింది దొరికింది పదా నువ్వే నీ చేతితో పూజ చేసి పంటలు పండిద్దాం. సరే అన్నయ్య పదా అలా భూమికి పూజలు చేసి పంటలు పండించడం మొదలు పెట్టాడు. అప్పుడు ఆనంది ఇదంతా చూసింది. ఒక వేసవి కాలంలో రంగయ్య, లక్ష్మి వ్యవసాయ పని ముట్లను తేవడానికి వెళ్ళారు. అప్పుడు ఆనంది వాళ్ళని చూసి అసలు ఏం మాట్లాడుతున్నరు అని వాళ్ళ మాటలు వింది. సరే చెల్లెమ్మ నువ్వు ఎందుకనీ ఆ రోజు నీ బంగారు నగలని నాకు ఇచ్చావు. ఏం టన్నయ్య నువ్వు ఎప్పుడు నాకోసం వదినకోసం పిల్లలకోసమే చేస్తావు కదా అన్నయ్య నేను నా భూమి వాటా కూడా వదినకు ఇవ్వాలనుకుంటున్నాను. ఎందుకు చెల్లెమ్మ ఎందుకంటే వదినమ్మే మాకు ఎన్నోసార్లు నాకు నా కొడుకుకు తల్లిలా ఆదరించింది. అలాగే కసురుకోకుండా నాకు నా బిడ్డకు అన్నం పెడుతుంది కదా అన్నయ్య. ఆ మాటలు విన్న ఆనంది వాళ్ళ దగ్గరకి వెళ్ళి నన్ను క్షమించండి. మిమ్మల్ని నేను అర్థం చేసుకోలేదు, నేను ఇప్పటి నుండి మీతో వ్యవసాయ పనులు చేస్తాను అంది. అప్పటి నుండి పంటలు పండిస్తు మెల్ల మెల్లగా ధనవంతులు అయిపోయారు.

**నీతి: కష్టంలో ఉండే వ్యక్తి మన తోబొట్టు అయినా, ఇతరులైన సహాయం చేస్తే ఎప్పుడు నష్టపోరు.**

**- అంజలి**
9వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్. కుర మం॥ జైనథ్, జి॥ ఆదిలాబాద్



నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 9-1-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | హైదరాబాద్ 3

### నమ్మలేని నిజాలు

ఇసుక లొల్లి
ఖజానకు చిల్లర
ఊరని ఊట

నీటి కొరత
బతుకులు భారం
మళ్లీ వలసలు

చేతిలో బొమ్మ
కుటుంబానికి దూరం
కొత్త వ్యసనం

కనిక మంత్రి
అధికార తంత్రాలు
నేతల మార్గం

సూర్య గ్రహణం
గ్రహచార గోచారం
బుద్ధికి మేత



- రేడియమ్
9291527757

### శ్రీనిజాలు

అందమైనఆయుధమని
పొంగిపోయె తుంటరి!
ఆయుధమే నమ్ముకుంటె
మిగులు ట్రంపు ఒంటరి!

భగ్గుమంటుందని తెలిసి
కూడ ఎందు కనో తవ్వె
అనవసర మైన పోకడ
అమెరికానె కాలుదువ్వె



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## చీకట్లో శుభాకాంక్షలేమిటీ?

మాటల కోటలతో
ఒక సంవత్సరం వెళ్లిపోయింది
కొత్త సంవత్సరం పాతగానే కనిపిస్తుంది
శుభాకాంక్షల పూలు వికసించటం లేదు
మనసు నందన వనంగా లేదు.

2019 శూన్యం
2020 అంతే సంగతులు
చీకట్లు చిక్కనపుడే తప్ప-
జనానికి మిగిలిందేమిటీ?
గత సంవత్సరానికి
ఘనమైన చరిత్రేమి లేదు
జనానికి ఏముంది?
ఏ సంవత్సరమైనా ఒకటే
కష్టం, కన్నీళ్లు,
ఆకలి, అప్పులు, భయాలు

నిరంతర పరాజితులు వాళ్లు
శ్రమ చెమట ఓడిపోయిన ఏడాది
2019కు చరిత్ర లేదు
కాశ్మీర్ భయం భయం
పౌరసత్వం ఘర్షణమయం
రాజకీయ నాయకులకు అంతా శుభమే
కార్పొరేట్ సామ్రాజ్యానికి అన్నీ లాభాలే
నిశ్శబ్దం, చీకటి ఆవరించిన
2019 ఆఖరులో-
ఒక శబ్దం ఆయుధమయి నిల్చింది
ఒక వెలుగు ఆశాదీపమయ్యింది
జనం చైతన్యం గోదారి పరవళ్ల ఆనందం.



-సి.హెచ్. మధు
9949486122

## చిరుప్రాయం

అమ్మ నాన్నలు
నీకు జన్మనిచ్చితే
అమ్మమ్మ నాన్నమ్మలు
నీకు లాలలు పోసితే
తాతయ్యలు నిద్దురపోకుండ
జోలపాటలు పాడి
నిన్ను నిద్దుర పుచ్చారురా ఓ కన్నా!

మేనత్తలు మేనమామలు నిన్ను ఎత్తుకొని
ఆటలెన్నొ ఆడించారు
చనుపాలతో నీ కన్నతల్లి
కడుపు నింపింది
నువ్వు ఏడ్చిన ప్రతిసారి
గోరుముద్దలు చేసి
చిన్నమ్మ చిన్నాన్నలు తినిపించారు!

నాన్న ఎదపై నీ అడుగులతో
నువ్వు ఎన్నిసార్లు తన్నిన
నీ చిలిపి చేష్టలతో
లోకంలోని బాధలను మరిపించావు
ఎన్నిసార్లు బుడి బుడి
అడుగులతో పడి లెచినావురా
ఎత్తుకున్న ప్రతి ఒక్కరు
నిన్ను చూసి మురిసారురా!

ఇంతింతై వటుడింతైన రీతిలో
నువ్వు దిన దిన ప్రవర్ధమానుడివై
మన వంశానికే
వన్నె తెచ్చావు రాముడిలా!
నీ కాళ్ళకు కడియాలు తొడిగితే
ఆ గజ్జెల సవ్వడులతో
అందరిని ఆట పట్టించావు
ఆకలి దప్పులు మాని ఓ చిన్నా!

అల్లరి పిల్లలతో ఆడుతూ
ఎన్ని కొంటి పనులు నువ్వు చేసిన
యశోదను కానురా
నిన్ను రోటికి బంధించడానికి
కైకను కానురా కారడవుల పంపడానికి
ఓ బిడ్డా! నీ కడుపు చల్లగుండాలి
ఓ బాబు నీలాగే ప్రతి బిడ్డ ఎదగాలి!



- నేతాజీ
98496 36389

## యుగాంతం

నేలపై నడిచే నెలవంకలు
వెన్నెల వీదులన్నీ
తమ తోబుట్టువుల చిరునామాలు అని
భ్రమపడి స్వతంత్రంగా జీవిస్తుంటే
మట్టిలో కలిసేదాకా
వెంటాడే యమపాశాలు
మసిపూసి బ్రతుకులను మింగేసే
బ్లాక్ హొల్స్

ప్రకృతిని పంజరాన
బంధించినా భద్రత లేదే!
చుట్టూ ఉన్న ఊచలన్నీ
మగువను మనిషిగా
గుర్తించలేని ఊసరవెల్లులు.

ఒక్కోసారి చిరుగాలి స్పర్శకు
కూడా భయాందోళనలను
చిందిస్తుంది స్త్రీ నెత్తురు

అయ్యో పాపం "ఆమె"
అనని రోజు ఒకటి ఉందా?
మృగవాంఛకు బలి అవుతూ
ఆడపిల్ల నెత్తురోడని
ఊరొకటుందా?

కలుపు మొక్కలపై జాలిపడి
ప్రాణభిక్ష పెడుతూ
విలువైన పంటను కోల్పోవడమే న్యాయమా?

ఆడపిల్లను పుట్టనివ్వరు కొందరు
పుడితే బ్రతకివ్వరు మరికొందరు

అద్దె గర్భాలు కూడా
దొరకని పరిస్థితి రావచ్చు
యుగాంతం సంభవించవచ్చు.

సృష్టిని ప్రసవించడానికి అయినా
బ్రతకనివ్వండి

మాతృత్వం ఆచూకీ మాయం చేయకండి
ఆమె కూడా అమ్మే.



- సుజనా రాజు
సెల్: 9881496122

## తెలుసుకో...

ఆకాశము కురిపించిన నీటిని నీటి బిందువులను
కర్తవ్య దీక్షతో.. సంఘశక్తితో పొదుపుచేసి
ఇంటింటా ఇంకుడు గుంతలకు అందరినీ ప్రోత్సహించి
కొత్త మొక్క ఒకటినాటి, నాటిన మొక్కకు నీరుపోసి
చిగురు పల్లవాలకు పరవశించి
మొగ్గ పువ్వులతో ఎదిగే మొక్కను
లేవగానే చూచి
ఉవ్వెత్తున ఆనందంతో తేలాలి హృదయాలు
ఎండిపోయే మొక్కలకు, నిర్లక్ష్యపు నీడ తాకకుండా
దోసెడు నీరుపోసి, చిగురిస్తే సంతోషించాలి
ఊరంతా పచ్చని చెట్లయితే
పర్యావరణ కాలుష్యం ఉండదు
నిస్వార్థం, పరోపకారం వృక్షాల నుండి నేర్చుకొని
ఆ వృక్షాల చల్లని నీడలో సేద తీరితే
ఆరోగ్యమస్తు అంటూ దీవిస్తాయి
మీ పిల్లలలాగ మమ్ము కాపాడండని
జాలిగ కొమ్మలు చల్లని గాలి విసరుతూ వేడుకుంటాయి
సమయాన్ని వృధా చేయక
జలరక్షణ, వనరక్షణ మన కర్తవ్యంగా భావించాలి
పచ్చని ప్రకృతితో,
నిండు జలాశయాలతో మన మనసులు పులికించాలి.



- వై.సుగుణాదేవి
సెల్:9010480955

## అంతరంగం

అందం..
వదనంలో ఉండదు
అంతరం ఆవిష్కరిస్తుంది
నలుగురితో నవ్వుతూ మాట్లాడు
నలుగురినీ నవ్వుతూ పలుకరించు
ఆ పలుకరింపుతో
అనురాగ పరిమళం పంచు
నీకన్నా అందంగా
ఎవరూ కనిపించరు
ఆనందమే అందం
ఆనందమే
జీవిత మకరందం
మనిషి కన్నా
మనసు గొప్పది



- కసిరెడ్డి జలంధర్‌రెడ్డి
సెల్: 9603499248

## 'నీతి సుదాలహరి' పుస్తకావిష్కరణ

సుధాలహరి కవిత పద్యాల పుస్తకంలో కవితాశైలి మృదు మధురంగా ఉందని డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. ఉజ్వల సాంస్కృతిక సంస్థ శ్రీ త్యాగరాయ గానసబ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కళా సుబ్బారావు కళా వేదికలో కోట శ్రీరామమూర్తి రచించిన నీతి సుధాలహరి పద్య, గేయ సాహిత్య, మంగళహారతుల పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగ హాజరైన వకుళాభరణం మాట్లాడుతూ సహృదయుడు, మృదుభాషణుడైన శ్రీరామమూర్తి తన మదిలోని బావాలను లయాత్మకంగా, సరళంగా కంద, ఆటవెలది తేటగీతులతో అందంగా మలచి చేతి సుధాలహరిలో అందించారన్నారు. బైస దేవదాసు మాట్లాడుతూ పద్య ప్రక్రియ ఎంతో అద్భుతమైందని తెలుగు వారికే సొంతమైన పద్య రూపంలో వెలసిన ప్రతి మాట విలువైనదేనన్నారు. రచయిత శ్రీరామమూర్తిలో బావావేశం, పరిశీలనాత్మక దృష్టి ఉందన్నారు. కార్యక్రమంలో దైవజ్ఞవర్మ, కె. శ్రీధరరావు, టి. నరేష్, బి. సత్యనారాయణ, సంస్థ అధ్యక్షురాలు యం. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు కె. రాధిక శిష్య బృందం నృత్యాంశాలు ప్రదర్శించారు.



పుస్తకావిష్కరణలో బి. సత్యనారాయణ, తంగిరాల నరేష్, రచయిత కోట శ్రీరామమూర్తి, బైస దేవదాసు, డా॥ వకుళాభరణం క్రిష్ణమోహన్‌రావు, దైవజ్ఞశర్మ, ఎం. లక్ష్మి, డా॥ కోట శ్రీధర్‌రావు.

## డా॥ సి. భవానీదేవి అక్షరీకరణ "తల్లీ నిన్ను తలంచి" హృదయ సంపుటి

### మాతృత్వ మానవీయతా దీప్తివంతం








పిల్లల భవిష్యత్తు కోసం తన జీవితాన్ని కర్పూరంలా కరిగించుకొన్న మా అమ్మ గురించి తలచుకొంటే కంట తడితో మసకేస్తున్నది" అంటారు. " తల్లీ నిన్ను తలంచి" సంపుటిలో, కన్న బిడ్డల గుండెచప్పుడు ముఖాముఖి పలకరింపులుగా, అక్షరీకరించిన రచయిత్రి డా॥సి. భవానీదేవి. పద్మభూషణ్ డా॥ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి గారి పలకరింపుతో ప్రారంభమైన ఈ పుస్తకం నిండుగా, 53 మంది వివిధ రంగాల ప్రముఖుల అమ్మల గురించిన స్పందనలు చదువరుల హృదయాలను కదిలించి వారి అమ్మలను గుర్తుచేయటం ఈ సంపుటి విశేషాంశం. ఎందరో మాతృమూర్తులు, కొలువుదీరిన ఈ గ్రంథస్థం, కవయిత్రి భవానీదేవి, ప్రతి కుటుంబంలో అమ్మతో పెంచుకొన్న, పంచుకొన్న ప్రేమానురాగాలు, నిత్య ఆత్మీయ బాంధవ్యం, మధురానుభూతులు, కన్నీళ్ళ కథనాలు జీవన జ్ఞాపక చిత్రాలుగా దర్శింప చేస్తారు. అమ్మ చేతిలో శిల్పీకరించిన వ్యక్తిత్వాలు అన్నీ వివిధ రంగాలలో ప్రతిభావంతులు కావటంతో, మాతృత్వ మహనీయత్వం ప్రతిపుటలో స్పష్టమవుతోంది. జర్నలిస్టుగా డా॥ భవానీదేవి ముఖాముఖిలో "పలికించిన వారు రామభద్రుండట' అన్నట్టుగా ప్రశ్నలతో హృదయాలను కదిలించి రాబట్టిన అంశాలు "తల్లీ నిన్ను తలంచి' గ్రంథాన్న ఒక అపురూప కావ్యంగా తీర్చిదిద్దాయి. డా॥ శోభానాయుడు, ఓల్గా, సంధ్య, డా॥ భారతి, శారదా శ్రీనివాసన్, అలేఖ్య, రాధాకుమారి, ప్రమీల, వాణిశ్రీ, శారదా అశోక వర్ధన్, ఉషా గాయత్రి వేదవతీ ప్రభాకర్, రంగమణి, రాగతి పండరి వంటి వివిధ రంగాలలో సుప్రసిద్ధులైన మహిళలు తమ ఉన్నతికి కన్న తల్లులు దారి దీపాలుగా నడిపించటం, ఆడపిల్లల జీవితాలను, తల్లులు ఎలా ప్రభావితం చేస్తున్నారో రచయిత్రి స్పష్టం చేసారు. నేను ఆడపిల్లననే భావం నా చిన్నతనంలో ఒక్కనాడు కూడా మా అమ్మ కల్పించలేదు. కోపం రావల్సింది పిల్లలకే గాని, తల్లులకు కాదని చిన్నప్పుడు మా అమ్మ నాకు నమ్మకం కలిగించింది అంటారు ఓల్గా. అందరి స్పందనలు చదువరులను కదిలిస్తాయి.

మధ్య తరగతి, వేద కుటుంబాలు ఆర్థికంగా నిలద్రొక్కుకోవటానికి ఇబ్బందులు పడే రోజుల నాటి వాస్తవ కథనాలు కావటంతో ఈ పుస్తకంలోని మాతృమూర్తుల చిత్రణలలో ఎంతో వేదన, సంఘర్షణ మానసిక వ్యధ చదివింపచేస్తోంది. కుటుంబ నియంత్రణ అంతగా ప్రచారానికి నోచుకోని నాటి దశాబ్దాలలో పిల్లల పెంపకం, పోషణ, విద్యాబుద్దులు మధ్యతరగతి సంసారాలలో ఆలనా పాలనా, ముద్దు ముచ్చట్లు తీర్చే అన్ని బాధ్యతలు మాతృమూర్తుల శారీరక, మానసిక సంక్షోభానికి కారణం అవుతున్నాయి. దానికి తోడు సామాజిక దుస్థితి. ఇతివృత్తం అందరికీ 'అమ్మ'. జీవితాలు, ఎంతో వైవిధ్యంగా ఎన్నో విశేష సంఘటనలు ఆసక్తిగా చదువరులను ఆకట్టుకొంటున్నాయి. ఒక అమ్మ జీవితం కన్నీటి సంద్రంలో నావ, మరొకరి అమ్మ వేదనాయుత జీవితంలో కన్నీటి వెచ్చదనం, అమ్మ చేతిలో శిల్పీకరించబడిన విశిష్ట రచయితలు, కవులు, సినీనటులు, కళాకారులు అన్ని రంగాలలో జవం, జీవం పొందిన అమృత హృదయాలు అంతా అమ్మకి ప్రణమిల్లారు.

కన్నబిడ్డల గుండెచప్పుడు వినిపించటంలో డా॥ సి. భవానీదేవి మాతృ ఔన్నత్య ప్రేమ మాధుర్యాన్ని వివరించే కవుల కవితలను ముందు పేర్కొనటం, ఆ నిష్ణాతుల ప్రతిభా విశేషాలను పరిచయం చేయటం తల్లీ నిన్ను తలంచి" శీర్షికను నిర్వహించిన తీరు తెన్నులు ఉన్నత సాహితీవిలువల సృజనాత్మకతకు అద్దం పడుతున్నాయి. అమ్మను గురించి చెప్పమని పలకరించటం, ఆ శీర్షికను ధారావాహికంగా నిర్వహించటమే కాకుండా ఎంతో వ్యయ ప్రయాసలతో, గ్రంథంగా వెలువరించటం ఆదర్శనీయమైన సామాజిక సాహితీ సేవగా గుర్తింపు పొందుతోంది. మాతృమూర్తుల జీవన నిష్క్రమణలు అమ్మను గుర్తు చేసి కన్నీళ్ళు పెట్టిస్తాయి. 'అహంకారం.. లంచం వద్దు" అనే ఆనాటి అమ్మమాట నిరంతరం నా కరదీపిక'' అంటారు. డా॥కె.వి. రమణాచారి. చదువుతో పాటు సంస్కారం ప్రేమ, బాధ్యత, ధ్యేయం నేర్పి వ్యక్తిత్వ నిర్మాణానికి పునాదివేసి నా కోసమే అమ్మ బతికింది అంటారు. ఆర్థ్ర హృదయంతో నృత్యం నా శ్వాస, ఆ శ్వాస పోసింది మా అమ్మే అంటారు డా॥ పుంజాల అలేఖ్య. మా అమ్మ గొప్ప శిల్పి. ఆ శ్వాస పోసింది. మా కుటుంబమనే శిల్పాన్ని చెక్కింది. నాకు జన్మతో పాటు ధన్యతనూ యిచ్చింది అన్నారు డా॥ ఓలేటి పార్వతీశం. లక్షలు గడించకున్నా, అప్పులు లేకుండా జీవిస్తే చాలు. అదే లక్షణమైన జీవనం' అని అమ్మ చెప్పేది అన్నారు డా॥ వద్దేపల్లి కృష్ణ. నిజాయితీగా ఉండమని, కష్టపడే వాడు ఎక్కడయినా బతకగలడనీ మనకున్న దాన్లోనే లేనివాళ్ళకి పెట్టాలనే అమ్మమాట ఆణిముత్యంలా మనసులో దాచుకున్నాను అంటారు పి. రాజేశ్వరరావు. నిజానికి అమ్మల కాలం అయిపోయింది. అప్పుడు అమ్మకి ఇల్లు, భర్త బిడ్డలే లోకం. ఇప్పుడు మమ్మీలకు స్వంత జీవితానికి ప్రాధాన్యత పెరిగింది అంటారు కోట శ్రీనివాసరావు. మా అమ్మది విశ్రాంతి ఎరగని జీవితం. అధైర్యం, బేలతనం ఆమెకు తెలియదు. అమ్మకున్న మరో లక్షణం మానవత్వం అంటారు సరసి.

బహుశ కన్యాదానం చేస్తూ మా అమ్మ. నా కొంగున బంగారు భవిష్యత్తు మూటకట్టిన ఆత్మ విశ్వాసి. ఆమె పర్యవేక్షణలో నా కళా జీవితాన్ని తీర్చిదిద్దుకున్నాను అంటారు డా॥ మద్దాళి ఉషాగాయత్రి. ఎంత మంది వున్నా అమ్మలేని ప్రతి మగాడు అనాధే అంటారు భువన చంద్ర. శాంతా బయోటెక్స్ అధినేత డా॥ వరప్రసాద్ రెడ్డిగారి సౌజన్య సంస్కార వదాన్యతకు అభినందనలు. డా॥ భవానీదేవి అక్షర దీప్తి హృదయాలను కరిగించి జ్యోతిర్మయం చేసింది.

ప్రతులకు: డా॥సి. భవానీదేవి
ఫ్లాట్ నెం. 102, గగన్ మహల్ అపార్ట్‌మెంట్స్
దోమల్‌గూడ- హైదరాబాద్-500 029
ఫోన్: 040-27636172



-జయసూర్య
సెల్: 9440664610

## 'లోపల ఖాళీ' రామా చంద్రమౌళి కథలు ఆవిష్కరణ



నూతన సంవత్సరంలో వంశీ సంస్థ కళా సేవలో దూసుకుపోతుంది. సినారె-వంశీ విజ్ఞానపీఠం, శ్రీ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో కళా సుబ్బారావు కళావేదికలో "లోపలి ఖాళీ" రామాచంద్రమౌళి కథలు గ్రంథావిష్కరణ సభ జరిగింది. ప్రముఖ రచయిత కేంద్ర సాహిత్య పురస్కార గ్రహిత డాక్టర్ అంపశయ్య నవీన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. 300కు పైగా కథలు రాసిన రామా చంద్రమౌళి ఆలోచనాత్మకమైన విలువైన కథలు రాసారని, సాంకేతిక విజ్ఞాన ఆచార్యునిగా ఉంటూనే మనసుకు సంబంధించిన కథలు రచయిత రాయడం గొప్ప విషయమన్నారు. కళాబ్రహ్మ, సేవా మహాత్మ, శిరోమణి డాక్టర్ వంశీరామరాజు (వంశీ సంస్థల వ్యవస్థాపకులు) సభాధ్యక్షత వహించారు. శ్రీ త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి విశిష్ట అతిథిగా హాజరైనారు. ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ గ్రంథసమీక్ష చేసారు. యాంత్రిక సమాజంలో మనిషిలో ప్రేమ, మమత, విలువలు కరువై లోపల ఖాళీలు ఏర్పడ్డాయని, మనిషి నైజాన్ని వివరిస్తూ రాయబడిన సమాజమేలు కోరే కథలు ఈ గ్రంథంలో ఉన్నాయన్నారు. వంశీ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి సభా నిర్వహణ చేసారు. కార్యక్రమంలో సుంకరవల్లి శైలజ (వంశీసంస్థ ప్రధాన కార్యదర్శి) పాల్గొన్నారు. ప్రముఖ నృత్యగురువు వోలేటి శ్రీలేఖ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు.

## మానేపల్లి సత్యనారాయణ అభ్యుదయ వాది



జ్యోతి వెలిగిస్తున్న డి.ప్రభాకర్‌రావు. చిత్రంలో సుజారమణ, పొత్తూరి సుబ్బారావు, కళా జనార్ధనమూర్తి.

కవి, కథకుడు, వ్యాసకర్త, విమర్శకుడు అయిన దివంగత మానేపల్లి సత్యనారాయణ అభ్యుదయవాది అని 'సాహితీ కిరణం' పత్రికా సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు నివాళులర్పించారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మంగళవారం కళా లలిత కళావేదికలో మానేపల్లి సత్యనారాయణ జయంతి నిర్వహించారు. పొత్తూరి సుబ్బారావు ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడుతూ మానేపల్లి సత్యనారాయణ అభ్యుదయ, విప్లవ భావాల ప్రచారానికి కృషి చేసిన సాహితీవేత్త అన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావు హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించారు. మొదట ప్రముఖ గాయని సుజారమణ భక్తి ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు.

## ప్రకృతికి అండగా

పద పద
పద ముందుకు
అదరక
బెదరక పద ముందుకు
ధ్యేయం నీ
ఆయుధం
సాయం నీ గుణం
అద్వైతం నీ మతం
సాగు ముందుకు
సాగిల పడక
తల వంచక ధీర వనిత వై
భూదేవి వారసురాలిగా
పుడమి కన్న బిడ్డవై
నీ అడుగే అనంతమై
నీ పలుకే ప్రవాహమై
నీ శ్వాసే మూలమై
పద పదమంటూ
శంఖారావం పూరించగా
ఓం కారమే ప్రజ్వరిల్లి
కనుల సాక్షిగా
కాపాడు ప్రకృతిని
బ్రతికించు జీవరాశులను
అండ దండగా నిలువు
జీవజాతుల మనుగడే
ప్రశ్నార్థకంగా
మారిన తరుణంలో
పూరించు శంఖారావం....



పి.విశాలాక్షి
9908435805

## నిజాలు!

ముందుగా బుద్ధి చెప్పాలి-
తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే దద్దమ్మలకు.
ముసుగుల తొడుగులేల-
మనిషి స్ఫటికమై.,మనసు సలిలమై.
వాస్తవాలు వాస్తవాలే-
మనకి నచ్చకున్నా,మింగుడు పడకున్నా.
బూడ్దిలో పన్నీరు నీతిబోధ-
పంకం పందికీ,మద్యం మధ్యరాత్రి వత్సరాదికీ.
దులపకు గొంగళి పుర్గని-
కాస్త భరిస్తే సీతాకోకచిలకనవనూ.
బెదరను..యుద్ధమేదైనా-
సిద్ధమెప్పుడూ..ఆయుధమే నేనుగా.
మేలుకుంటే కోలుకోలేం-
కలకాలం కల కాలంగా కడతేరనీ.
కవిత్వం పురుడోసుకుంది-
మనసు ప్రేగు తెంచుకొని.,మరోసారి.
హద్దుమీరితే పతనమే-
హేతువు మగువైనా మధువైనా.
ఏడడ్గుల దారితో నూరేళ్ళు-
అద్వైతం అనుభూతిస్తే...ఆనందం పరవళ్ళు.
పోటీ లేని చోటు-
అది ఎప్పుడూ ప్రగతికి చేటు.
అన్నీ మనకు తెలుసు-
ఐనా తొక్కుడెందుకు అడుసు.
నాలుక చేసే పాపం-
ఒంటి మనుగడకు శాపం.
కూడు గుడ్డ గూడూ-
ప్రేమకు ముందే ఈ మూడూ.
పాత్రోచితమే నటన-
గెంతితీరాలిగా... హన్మంతు డన్నాక.
హాయ్..బాయ్..అంతేనా స్నేహం-
అంతరంగాల మమేకమేగా మైత్రి .
అక్షరం ఆయుధం అనాదిగా-
గుండెలోతుల్లో దింపేందుకు నింపాదిగా.



-డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## వివేక వాణి



నరేంద్రుని అకుంఠిత దీక్షాదక్షత
పరమహంస అపార గురుబోధనా ధార
గురుశిష్య సంగమమే విజ్ఞాన విస్ఫోటనమై
సర్వ వ్యాప్తమయ్యె విజ్ఞాన కాంతిపుంజాలు
పులకించెను పుణ్యభూమి పుణాదులు
సర్వవ్యాప్తం సనాతన భారత హృదయం

ఎల్లలు దాటెను వేద సుగంధపరిమళాలు
యువశక్తి ఉప్పొంగె ఉత్తుంగ తరంగమై
వివేకానందుని బోధనాప్రవాహంలో తడిసి !

దయగల మదే మందిరమంటూ
సమాజ హితమే మోక్షదాయకంగా
అభాగ్యుల సేవే భగవధారాధనై
జీవునిలో దేవున్ని దర్శించగల శక్తి

ధీర గంభీర సుస్పష్ట చైతన్య ప్రవంతి
అనంతశక్తి సమన్విత కర్తవ్యనిష్ఠ
సత్య సుందర కరుణాంతరంగ ధార
అలుపెరుగని అమూల్య వివేక వాణి
యువతకదేగా నిత్య ప్రభాత భేరి !

(12 జనవరి వివేకానంద జయంతి సందర్భంగా)



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## ఒక జ్వలనం గురించి...

నాకు
పగలేమిటి.. రాత్రేమిటి..!
తూర్పు తెరతీయటం
పడమర ముసుగెయ్యటమేమిటి!?
ఇంకా అవగతంకాని.. నా స్వగతం కోసం
ఈ అనంత విశ్వసృష్టి విన్యాసాల కోసం
ఈ భ్రమణ, పరిభ్రమణలనిజాల కోసం
నిత్యం వీక్షిస్తు.. నిరీక్షిస్తూ
క్షణం క్షణం.. ప్రతిక్షణం కలవరిస్తూ
పరితపిస్తుంటే.. యోచిస్తుంటే!

రోజంతా. దారి పొడుగునా
జ్వలనమే.. నా నైజం
ఊరికే.. ఉషస్సులు మధ్యన
కదిలే.. సాయం సంధ్యల ఒడ్డున
యుగాల నుండి.. కొత్త జగాల వరకూ
నా అంతరంగ రంగస్థల
ఉఛ్వస, నిచ్వాసలను.. పదిలపరుచుకుంటూ
ఉద్వేగాలను.. ఉద్రేగాలనూ.. వొదిలించుకుంటూనే
కాలగమన.. గుండెలయలు వింటూనే
నాకు.. నేనే, ఓ 'ఫజిల్' అవుతాను
చిరుగాలి స్పర్శకు.. కదిలే అగ్నిపూల అలనౌతాను!!

ఎపుడు.. చూసినా.. ఎటువైపు తిరిగినా
ఏదారిన సాగినా.. ఎటువైపు మళ్లినా
నా జనన, మరణ చక్రాలు..
అరనిమంటలు.. తీరిన ఆశలు..!

మరి నేను ఆరిపోయేదెలా!?
అఖండ జలారాశుల్ని
నాపై కుమ్మరించుకుని
నేను.. నేనుగా.. ఉపసంహరించుకుని
నన్ను.. నేను.. ఒక్కసారి చూసుకోవాలనుంది!
అలా.. జరగబోతున్నదనీ.. తెలిసినపుడు..!!
లెక్కలేనన్ని చూపుల బింబాలు
నా.. నిజరూపాన్ని చూసేందుకు
నిరీక్షిస్తూ.. ఎదురుచూస్తుంటాయి!
ఏదో జరగబోతున్నదనీ ఉత్కంటల జడివానల్లో..
కూర్చొంటాయి!!

నా గురించి.. నేనే ఆలోచిస్తూ
అంతర్మధనాల్ని.. తర్కిస్తున్నపుడు
అలౌకితత్వాన్ని.. దర్శిస్తున్నపుడు
నన్ను,, నేను.. తెలుసుకోవాలనే.. ఆరటం
నాలోని.. నన్ను.. కలుసుకునే.. అవకాశం
ఇక.. రానట్లేననిపించింది!
ఇక.. లేనట్లేనని తెలిసింది!!

ఈ భౌతిక ప్రపంచం నుండి
నా ఒంటికి పట్టించుకున్న
అహాల్ని.. త్యజించాలనేదే.. నా తపన
పనికిరాని అంతరాలను
అంతమొందించాలనేదే.. నా ఆలోచన–
నేను .. నేనుగా
ఆరిపోయిన.... ఆగిపోయిన
బ్రహ్మాండమైన చీకటినై.. శూన్యమై మిగిలిపోతే..!
ఈ విశ్వం.. జాడల్ని.. నీడల్ని విప్పలేను
చివరకు దేన్ని.. దర్శించలేను ఆవిష్కరించలేను!!

ఓ మానవుడా!
నా చిన్ని ప్రేమికుడా!!
ప్రతీ.. సమస్యకూ
ఓ పరిష్కారమున్నంత వరకూ
నా నిలకడే నీకు బలమనుకుంటా!
నిరంతర.. జ్వలనకు
నాకు ముద్దనుకుంటా!
భవిష్యత్తును చూసి ఆరని దీపమనుకుంటా!
చిరకాల.. ప్రయోజనమనుకుంటా!



– బి. గోవర్ధన రావు
సెల్: 9441968930

## మాటే తూటా

నీలాకాశంలో విహరించే పక్షులు
కరిమబ్బుల చిక్కటి
చీకటికి విహ్వలిస్తున్నాయి
ఇప్పుడు కూడా అందరిలా
ఇలాంటి కవిత్వాన్నే మాటాడాలి అనుకుంటున్నాను

కానీ,
ప్రస్తుతం అప్రస్తుతమైన వేళ
నిక్కచ్చితత్వానికి
బిగుసుకుంటున్న ఉచ్చులు
ఒకదాని తర్వాత మరొకటి
వెంటాడుతుంటే
మౌనంగా ఉండలేని
విభ్రమ పరిస్థితులు
దుఃఖాలను కుమ్మరిస్తున్నాయి

లక్ష్యాత్మకంగా మట్టుబెట్టే
పుచ్చి పోయిన బుర్రలు
తిరోగమనానికి పరుగులు తీయిస్తుంటే
వెన్నులేని వానపాములు
కరాళనృత్యం చేస్తుంటే
కష్టంగానైనా
మాటే తూటా అవుతుంది

ఉనికి మరచిన పిల్లి
'తీర్థయాత్ర'ల ముచ్చట్లు చెప్తుంటే
నేపథ్యం విస్మరించిన నక్క
'నీతి' ఊళ పెడుతుంటే
ఆలోచన పదునెక్కుతుంది
మాటే తూటా అవుతుంది



– నస్రీన్ ఖాన్
9652432981

## పుస్తక సమీక్షలు

# మౌనం పలికిన కవిత్వం






వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా, వందలాది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు చేయూతనిచ్చిన ఉత్తమ ఉపాధ్యాయురాలిగా, ఆధ్యాత్మిక చింతనా పరురాలిగా అసంఖ్యాకుల అభిమాన సంపదను స్వంత చేసుకుని రమాదేవి కులకర్ణి తొలి కవితా సంపుటి పేరు "రెప్పచాటు మౌనం", శీర్షికను కవితాత్మకంగా తీర్చిదిద్దడంలోనే తన ప్రతిభను చాటుకున్న భావుకురాలు రమాదేవి.

ఎవరికైనా రెప్పలమాటున కళ్ళుంటాయి. వాటినిండా కలలుంటాయి, కథలుంటాయి ఎన్నో కనపడని భావోద్వేగాలు, కన్నీళ్ళు, ఆనంద తరంగాలు దాగుంటాయి, మౌనంగా వ్యక్తీకరించే భాష వుంటుంది. రమాదేవి రెప్పచాటున అలనాటి స్నేహం తాలూకు జ్ఞాపకాలు దొంతరలు మౌనంగా దొరలుతున్నాయి. స్నేహం పట్ల అపారమైన నమ్మకం కవయిత్రిది.

**"మెట్టుగా నిన్ను (స్నేహాన్ని) చేసి**
**గట్టెక్కిన వైనం "గుర్తొస్తు వుంటుంది**
**గునపమై/ వేదనను తొలుస్తుంటే**
**ఇంకా మిగిలిన నమ్మకం**
**రెప్పచాటు మౌనంగా ఒదిగిపోయి**
**కను కొలుకుల్లోంచి జారిపడుతోంది"** అంటు ముక్తాయిస్తారు.

యిది వరలో తలగడ వస్తువుగా ఎంతో కవిత్వం ప్రవహించింది. చాలా మంది కవులు వివిధ కోణాల్లో తడిమారు. రమాదేవి దిండును దశావతారాలుగా అభవర్ణిస్తు 'మెత్త'టి కవిత నల్లారు.

**తాను అలిగినప్పుడు మెత్త హత్తుకునే**
**మేనత్త అవుతుందట**
**అలసినపుడు అమ్మ ఒడి అవుతుంది**
**ఒంటరిగ మిగిలి ఉసూరని కూర్చుంటే**
**ఆసరా యిచ్చే నాన్న అవుతుంది.**
**దిగులుగా కుదేలై పోతుంటే, ఎదమీద**
**చేరిన ప్రియుడులా, ఎటమి పాలై ఒంటరిగా**
**మిగిలిన నాడు నేస్తమై పక్కనే జేరిన**
**స్వాంతనంలా, ఆదమరిచి తడబడిననాడు**
**ఊతమిచ్చే చేతి కఱ్ఱలా** ఆదుకుంటుందట.

యింకా 'మెత్త'ను ఆమె ఎలా దర్శిస్తోందో చూడండి.

**"కడివెడు కన్నీటి సంద్రమై నేను**
**పొగిలిపోతుంటే**
**కన్నీళ్ళ చారికలు తనలోనే దాచి**
**నిద్దట్లో జార్చి జోల పాటైతది**
**తన ఊసుల్లో తనువే మరిచి**
**కలత చెందితే, గుండెలోకి ఒదిగి**
**కవెమ్మని కల అయితది**
**జీవమే లేని నా మెత్త**
**జీవమున్న నాకు**
**దశావతారములెత్తి కాపు కాస్తది!"**

ఈ కవిత్వ పొత్తంలో నాకు బాగావచ్చిన కవిత 'మెత్త'. చదివితే మీరూ ఒప్పుకుంటారు మంచి కవిత అనీ.

నేటి లోక రీతిని రమాదేవి వర్ణించిన తీరు గమనిస్తే అక్షరసత్యం అనిపించక మానదు.

**"ఒకప్పుడు ఒక మంచి పనికి**
**పదుగురు దోస్తులు ముందుండేవారు**
**ఇప్పుడు ఒక మంచి పనికి**
**ముప్పది మంది దుష్మన్‌లు అవుతున్నారు**
**కప్పలాగుడు సహకారం**
**కుటిల రీతుల సంస్కారం"** వ్యాఖ్యానం అక్కర్లేని పంక్తులు.

**"అహమునిండిన నాడు/ ఆత్మ దర్శనమవ్వదు"**
**"జీవించు జీవితాన్ని/ జీవన సాఫల్యంగా"**

వంటి ప్రబోధాత్మక వాక్యాలు కవితల్నిండా పరుచుకొని కవయిత్రి సామాజిక బాధ్యతకు దర్పణం పడ్తాయి.

ఈమధ్య కాలంలో నాలుగు రోడ్ల కూడళ్ళలో నెలల పసికందుల్ని చంకలో వేసుకుని, ఆ చిన్నారుల కాళ్ళు, చేతులకు పట్టాలు కట్టి ఆ పట్టీలపై ఎర్రటి రంగు పులిమి, ఎర్రటి ఎండలో, హోరున కురుస్తున్న వానలో బిక్షాటన చేసే యాచకురాళ్ళు దర్శనమిస్తున్నారు. ఆ ఎర్రటిది రక్తమూకాదు. ఆయాచకురాలు ఆ పసిగుడ్డుని కన్న తల్లీ కాదు. ఎవరామె?

**'తలలు మార్చు పసిబిడ్డల మాఫియా దొరసాని" "ఎవరు కాపాడాలి/ వీధి పాలైన పసికందుల/ జీవితాలను!?"** అంటు రమాదేవి వినిపించిన "గోస" చదివితే కళ్ళు చెమర్చక మానవు. సమాజాన్ని ఎంతో లోతుగా చదివితే తప్ప యిలాంటి హృద్యమైన కవిత్వం రాయడం సాధ్యం కాదు. 'ఏందిరో' అంటు లేనివాడు, ఉన్నవాడి మీద విరుచుకబడిన వైనం గమనిస్తే భగ్నమైన రమాదేవి మౌనం ఎంత తీవ్రంగా గర్జిస్తుందో అర్థమవుతుంది.

రమాదేవి కులకర్ణి మొదటి ప్రయత్నం ఇది. తొలి అడుగుల్లో తడబాటు తప్పనిసరి. ఎంచుకున్న వస్తువు కవిత్వానికి లొంగకపోవచ్చు. అక్కడక్కడా వచనంలా తేలిపోవడం సహజం. ఎంతటి వారికైనా ఎదురయ్యే ఈ యిబ్బందిని అధ్యయనం, అభ్యాసం ద్వారా అధిగమించవచ్చు. అయిదుగురు ప్రముఖులు తమ ముందు మాటల్లో అందించిన నర్మగర్భ విశ్లేషణలు, సూచనలు లోతుగా గమనించి కవితా నిర్మాణంలో మరిన్ని మెళకువలు గ్రహిస్తే రమాదేవి మున్ముందు మంచి కవిత్వం దిశగా అడుగులేస్తారని నా నమ్మకం.

ప్రతులకు: రమాదేవి కులకర్ణి
స్పార్క్ కాన్సెప్ట్ స్కూల్
హుడాపార్కు దగ్గర, ఉప్పల్
మెడ్చల్, తెలంగాణ–500 039
సెల్: 8985613123



– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

# 'కావ్య' సిరులు!






**"కావ్య సిరులు పంచి కలిమి పెంచు"**

**మకుటంతో చిన్నారి డా॥ పిట్ల కావ్య "కావ్యమాల"** పేరుతో ఓ శతకాన్ని వెలువరించిడం అభినందనీయం. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కావ్య పిట్ట కొంచెం రాత ఘనం అన్నచందంలా ఛందోబద్ధ పద్య రచనకు శ్రీకారం చుట్టడం ముదావహం. ఉపాధ్యాయులు గుండ్లరాజు గారి సంపాదకత్వంలో వెలుగులోకి వచ్చిన ఈ శతకంలో 116 పద్యాల ద్వారా కావ్య ప్రకటించిన భావాలు ఆమె యొక్క సృజనాత్మక ప్రతిభను చాటేలా ఉన్నాయి! సామాజిక అంశాలే ఆలంబనగా కొనసాగిన ఇందలి ఆమె రచన అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది.

ఈ శతకంలోని ఆటవెలది పద్యాల్లో కావ్య అనేక అంశాలను ఆవిష్కరించడం అభినందనీయం.

**'తేనెకన్న మిన్న తెలుగు భాష మనది**
**మధురమైన భాష మాతృభాష**
**విన్నవారి కెపుడు వీనులవిందౌను**
**కావ్యసిరులు పంచి కలిమి పెంచు"** అను తెలుగు బాష యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పారు.

చెట్ల యొక్క ప్రాశస్త్యాన్నితెలుపుతూ.. రాసిన పద్యంలో..

**'వసుధనున్నచెట్లు వరములై జనులకు**
**పచ్చదనము నెంతొ పంచుచుండె**
**ప్రాణమున్నమనకు ప్రాణవాయువుచెట్లు**
**కావ్యసిరులు పంచి కలిమిపెంచు"** మంటూ హితవు పలికింది.

**చి॥ కావ్య తమకు బోధించే ఉపాధ్యాయులకై పద్యాలల్లి మెప్పించింది. తమ గురువులకు పద్య సుమాలు సమర్పించింది.**

**అమ్మ మనకు యెపుడు యపురూప దైవము**
**అమ్మ మాట లిన కమ్మదనము**
**అమ్మ చేతి వంట నౌషధగుణమురా**
**కావ్య సిరులు పంచి కలిమి పెంచు"** అంటూ అమ్మ యొక్క ఔన్నత్యాన్ని ఈ పద్యంలో ఆవిష్కరించింది.

**"మంచి గుణముతోడ మహినందం బతకాలి**
**చెడ్డ గుణము దరిచేరనీకు**
**విశ్వమందు నీవు విలువ యుంచుకొనుము**
**కావ్యసిరులు పంచి కలిమి పెంచు"** అంటూ హితవు పలికింది.

ఇలా చిన్న వయసులోనే ఛందో బద్ధ రచనలకు శ్రీకారం చుట్టిన చి॥ పిట్ల కావ్యకు ఆశీర్వాభినందనలు తెలుపుదాం. ఆమెను ప్రోత్సహించిన సంపాదకులు శ్రీ గుండ్లరాజు.. ప్రధానోపాధ్యాయులు శ్రీ సముద్రాల శ్రీనివాస్ తదితర ఉపాధ్యాయ బృందానికి అభినందనలు అందజేద్దాం.

చి॥ కావ్య తమ రచనా వ్యాసంగాన్ని ఇంతటితో ఆపకుండా.. భాష పట్ల ఇంకా పట్టు సాధించి.. కవిత్వ సృజనలో మెలకువలు తెలుసుకుని మరిన్ని మంచి రచనలు చేయాలని ఆశీర్వదిద్దాం. ఆ దిశలో ఆమె అడుగు వేయాలని కోరుకుందాం.

ప్రతులకు: గుండ్లరాజు
ఇ.నెం.11-2-56/సి
భరత్‌నగర్
సిద్దిపేట–502 103.
సెల్: 9885257050



–దాస్యం సేనాధిపతి
94405 25544

# అసెట్ (ఆస్తి) లయబిలిటీ (అప్పు)



## అనుభవాలు పాఠాలు-9

నేను సి.ఏ.గా క్వాలిఫై కాకముందు ఓ ప్రభుత్వ కార్పోరేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. ప్రభుత్వ సంస్థ కావటంవల్ల మరియు నేను సి.ఏ.గా క్వాలిఫై కాకపోవటం వల్ల నా బీకాం క్వాలిఫికేషన్‌ను మాత్రమే దృష్టిలో పెట్టుకుని "జూనియర్ ఎక్కౌంటెంట్" ఉద్యోగం ఇచ్చినా సంసారాన్ని బొటాబొటిగా ఈదటానికి మాత్రమే సరిపోయే జీతం.

సి.ఏ. చదువులో గడించిన అనుభవం వల్ల అక్కడి ఉద్యోగ బాధ్యతల్ని "నల్లేరుమీది నడక"లాగా ఎంతో సునాయాసంగా నిర్వర్తించగలిగేవాడ్ని. నాలో ఉండే ప్రతిభను గుర్తించి నా పైఅధికారి సీనియర్ ఎక్కౌంటెంట్, ఆపై అధికారి – ఎక్కౌంట్స్ ఆఫీసరు, ఇద్దరూ వాళ్ళు చేయదగ్గ బాధ్యతల్ని కూడా కొంతమేర నాకు అప్పగించేవారు. సి.ఏ. చదువుతో వచ్చిన అనుభవం, నేర్చుకోవాలన్న నా కుతూహలం, ఉత్సాహం, ఈ రెంటివల్ల నాకూ, మొదట్లో ఆ అదనపు పనులు వ్యక్తిగత సంతృప్తిని కలుగజేసేవి.

ఆ సంస్థలో ఏటా "పర్ఫార్మెన్స్ రివ్యూ" అని నిర్వహించి వ్యక్తిగత నిపుణతకు విలువకట్టి, ఇంక్రిమెంట్లు, పైపదవికి ప్రమోషన్లు గట్రా నిర్ణయించేవారు.

ఎలాగూ బీకాం క్వాలిఫికేషన్‌కంటే ఎక్కువ పనిచేసి పెడుతున్నాను గనుక ప్రమోషన్ ఇప్పించమని మా ఎక్కౌంట్స్ ఆఫీసర్‌ని వేడుకున్న ప్రతిసారీ; "సి.ఏ. ప్యాసు అవు. నీకు మంచి ప్రమోషన్ ఇప్పిస్తాను" అనే తాయిలం చూపి పనుల్ని చేయించుకునేవాడు.

సి.ఏ. ప్యాసయ్యాను. మా ఆఫీసర్‌కి ఈ విషయం తెలిపాను. ఆయన నన్ను అభినందించారు. నాలో గొప్ప టాలెంట్ ఉందన్నారు. మంచి భవిష్యత్తు ఉందన్నారు. తప్పకుండా పైకి వస్తానని మెచ్చుకున్నారు.

ఆయన పొగడ్తలకు నాకు నిజంగానే ప్రమోషన్ వచ్చినంత సంబరం, ఏనుగెక్కినంత సంతోషం కలిగింది.

కొన్నాళ్ళకు మా సంస్థకు అనుబంధ సంస్థలో సీనియర్ ఎక్కౌంటెంట్ ఉద్యోగానికి పత్రికా ప్రకటన వెలుబడింది.

ఆ అనుబంధ సంస్థలో సీనియర్ ఎక్కౌంటెంట్ ఉద్యోగానికి అభ్యర్థిని సెలక్టు చేసేది మా ఎక్కౌంట్స్ ఆఫీసరే.

"ఇన్నాళ్ళూ సి.ఏ. ప్యాసు కావటం అన్నది ఓ అడ్డంకిగా ఉండేది. ఇప్పుడు ఆ అడ్డంకి తొలగిపోయింది. అదీకాకుండా ఆ పోస్టుకు అభ్యర్థిని నిర్ణయించేది సాక్షాత్తూ మన బాసు. అందుకని, నీకు ఆ ఉద్యోగం ఖాయం" అన్నారు తోటి ఉద్యోగస్తులు. నాకూ నిజమేననిపించింది.

అందరు అభ్యర్థుల్లానే, నేనూ అప్లికేషన్ పెట్టుకున్నాను.

> ***ప్రతి వ్యక్తీ, ఈ అనంత జన ప్రవాహంలో 'సమూహంలో ఒకడు'గా జీవిస్తున్నవాడే!***
>
> ***ప్రతివ్యక్తీ, రోజూ ఏవేవో కొత్త అనుభవాల్ని ప్రోవు చేసుకుంటున్నవాడే!***
>
> ***ప్రతివ్యక్తీ, బ్రతుకుబడిలో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థే!***
>
> ***ఆ వ్యక్తిని ఆవరించుకుని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, సహాధ్యాయిలు, ఉపాధ్యాయులు, ఉద్యోగంలో చేరాక పై అధికారి, సహ ఉద్యోగి, సబార్డినేటులు, ఆ సంస్థతో లావాదేవీలు నడిపే వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు, ఇంటిచుట్టూ ఉన్న ఇరుగు పొరుగూ, రోజూ 'వాకింగ్'లో కనబడే పరిచయస్తులు ఇలా వీళ్ళందరితోనూ అనుభవాల్ని ప్రోవుకుంటున్నాడు.***
>
> ***ప్రతీ అనుభవం– తనది కావచ్చు లేదా ప్రక్కవారిది కావొచ్చు– లోంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగటంలోనే విజ్ఞత ఉంది. ఏడున్నర దశకాల కూర చిదబంరం జీవితంలో ఎదురైన అనుభవాలు, వాటిలోంచి నేర్చుకోగలిగే పాఠాలే ఈ "అనుభవాలు–పాఠాలు"–!***
>
> – సంపాదకులు

మౌఖిక ఇంటర్వ్యూలో కూడా, బాగానే చేసానన్న సంతృప్తి కలిగింది. ఆశావహంగా ఎదురు చూస్తున్నాను.

ఓరోజు ఆశనిపాతం లాంటి వార్త వినాల్సి వచ్చింది. నేను ఇంటర్వ్యూకు అటెండ్ అయిన ఉద్యోగం మరెవరికో ఇవ్వబడింది. ఆ అభ్యర్థి కూడా నాకు కొద్దో గొప్పో పరిచయం ఉన్నవాడే! ఆయన్తో పోల్చుకుంటే అదే కంపెనీలో పనిచేస్తున్నా నాకు ఎక్కువ మార్కులు పడ్డాయట! అయినా నేను సెలెక్ట్ కాలేదు.

ఎందుకిలా జరిగింది?

ఆ అభ్యర్థి అన్నయ్య ఎక్కడ్నుంచో తీగ లాగాడట!

మా ఆఫీసరు అందుకు తీవ్రంగా ప్రతిఘటించి, సరైన కాండిడేటు మన సంస్థలోనే ఉన్నాడని, గట్టిగా చెప్పలేకపోయాడు. ఫలితంగా రికమండెడ్ కాండిడేట్‌కే ఉద్యోగం ఇవ్వబడింది.

ప్రభుత్వ సంస్థల్లో ఉండే 'భజన మహాత్మ్యం' అప్పుడు నాకు తెలిసివచ్చింది.

ముసుగులో గ్రుద్దులాట ఎందుకని డైరెక్టుగా, మా ఆఫీసర్ని కలిసే ప్రయత్నం చేసాను. ఆయన చాలా తెలివైనవాడు.

విషయ ప్రస్తావన తేవాలనుకున్న ప్రతిసారీ ఏదో ఓ సాకుతో నన్ను తన కేబిన్‌నుండి బయటకు పంపేవాడు.

ఇక లాభం లేదనుకుని ఓరోజు ఆయన పిలవకుండానే, ఆయన కేబిన్‌లోకి వెళ్ళాను.

నేను చెప్పాల్సింది. మీరు వినాల్సిందేనని భీష్మించుకున్నాను.

నా సమస్యకు ఆయన జవాబు నన్ను చకితుడ్ని చేసింది.

"నువ్వు మా సంస్థకు అసెట్‌వి ('ఆస్తి' లాంటివాడివి) నిన్ను మేం వదులుకోలేము" అన్నాడు.

ఆయన చెప్పిన మాటల్లో నిజాయితీ కనిపించలేదు.

ఎవరైనా, వారి చేతుల్లో ఒక 'అసెట్' వుంటే జాగ్రత్తగా సంరక్షించుకుంటారు. ఆ అసెట్‌కి మెరుగులు పెట్టే ప్రయత్నం చేస్తారు. నిర్లక్ష్యం చేయరు.

మాటల్తో బులిపించి పని చేయించుకునే ఆయన ఆంతర్యం అవగతం అయింది.

మారు మాటాడకుండా బయటకు నడిచాను.

రెండునెలలు తిరక్కుండానే ఆయన అనుకునే ఆ 'అసెట్' తన ఉద్యోగానికి రాజీనామా చేసి మరో సంస్థలో చేరింది.

ఆ అసెట్ స్థానే ఆ సంస్థలో మరో కేండిడేట్ జాయినయ్యాడని ఆయన రికమండెడ్ కేండిడేటు అనీ, ఆ కేండిడేటు ఆ సంస్థ పాలిట లయబిలిటీ (అప్పు) అయ్యాడని విన్నాను.

సరైన మూల్యం చెల్లిస్తే తప్ప శుష్క ప్రియాలు, శూన్యహస్తాలు 'టేలంట్'ని పట్టి ఉంచలేవు



–కూర చిదంబరం
సెల్: 8639338675

## అంబేద్కర్ చూపుడు వేలే దిక్సూచి..



ఆ కొలను పక్షులతో నిండివుంది
గుంపులు గుంపులుగా అవి వస్తున్నాయి
సుదూరంగా ప్రయాణించినా
గమ్యం చేరడం వాటి లక్ష్యం
అవి జంటలగానే ఎక్కువ వున్నాయి
ఇప్పటికీ ఆహారాన్ని పంచుకుతింటున్నాయి
మనుషులు జంటలుగా బ్రతకలేకపోతున్నారు
ఆహారాన్ని పంచుకోలేకపోతున్నారు
ఆత్మీయతను పంచుకోలేకపోతున్నారు
వారిద్దరు దృశ్యంలో కలిసి వున్నట్టు నటిస్తున్నారు
దానికి ఖరీదు తీసుకొంటున్నారు
తల మీద పూల వర్షం కురుస్తుంది
పాదాలనిండా ముళ్ళు
త్యాగాల్లేని జీవన గమనాల్లో దారంతా గోతులే
నిరీక్షించలేని దురావేశాలు
సమాజమంతా వైరుధ్యభరితం
గులాభి వనాల్లో దుర్గంధ దొంతరులు
ప్రవహిస్తున్న నదీ తరంగాల్లో విష దుందుభులు,
చట్టాలు చేసేవారే అతిక్రమిస్తున్నారు
ఆధిపత్యం వున్నవాడికి అన్నీ బాకాలే
సత్యం చీకటి కుహరాల్లో నిద్రిస్తుంది
వాళ్ళిరువురు రాజ్యాంగాన్ని ధ్వంసిస్తున్నారు.
మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు రగిలిస్తున్నారు.
భారతీయులంతా ఒకటే అనే భావనపై
నిప్పులు చల్లుతున్నారు
వారు విధ్వంసకులా..? పాలకులా..?
ముస్లీమ్‌లు మానవులు కాదా!
వారి సంస్కృతిలో పరిమళం లేదా..!
కళా ప్రపంచాన్ని వారు సృష్టించలేదా..!
దళితుల గుండెలనూ చీల్చుతున్నారు
బౌద్ధ సంస్కృతినీ తునుమాడారు
అఖండ భారతాన్ని వ్రయ్యలు చేశారు
ఆ అమ్మాయి విశ్వ విద్యాలయం నుండి కేకలేస్తుంది
పోలీసులు లాఠీలతో ఆమెను మోదుతున్నారు
ఇనుప బూట్లతో ఆమె చేతులను త్రొక్కుతున్నారు
దానికి మీరు చరిత్రకు సమాధానం చెప్పాలి
ఆమె నెత్తురుతో భూమి తడుస్తుంది
మతం మారణ హోమంలో
భారతంలో నెత్తురు ఏరులై పారుతుంది
అంబేద్కర్ రాజ్యాంగం
సౌభ్రాతృత్వాన్ని రూపొందించింది
ప్రేమను పంచింది
ఈనాడు దేశాన్ని చీల్చాలని..
దేశంలో దేశాలు కట్టాలని చూస్తున్నారు
అవును! ఆ విద్యార్థిని గుండెగోళాన్ని
వ్రయ్యలు చేశాక మీకేమి మిగిలింది?
మనిషిని ప్రేమించలేనివాడు
పాలకుడు కాగలడా..!
మతోన్మాదం వారిని అంధుల్ని చేయడం లేదా..!
ఒక శిశువుకు గుక్కెడు పాలివ్వలేనివారు
ఒక గర్భవతికి పడక ఇవ్వలేనివారు
ఒక బాలునికి పలక ఇవ్వలేనివారు
ఒక నీతికి.. ఒక నిజాయితీకి
నిలబడలేనివారు
పాలకులు కాగలరా..!
ఒక మతోన్మాది..
విచక్షణ లేనివాడు
ఒక అవిద్యాపరుడు
ఒక విధ్వంసకర్త
దేశంలో మతాన్ని రెచ్చగొట్టడం
తేలికగానే చేయగలడు కదా..
కులం ఉక్కు గోడలు కట్టగలడు
మనిషిలో ఇంకా తోడేళ్ళు దాగి ఉన్నాయి సుమా..!
మళ్ళీ బౌద్ధ భారత నిర్మాణమే
ఈనాటి చారిత్రక అగత్యం
శాంతి, దాంతి, క్రాంతి వెల్లివిరియాలి
నీతి పతాకలు ఆకాశంలో ఎగరాలి
ఆ చెట్టు మీద వున్న పక్షి స్వేచ్ఛా గానం చేయాలి
ఆ గాయపడిని అమ్మాయికి ఓదార్పు కావాలి
మనుషులందరూ ఒకటేననే భావన పెరగాలి
సూర్యోదయంలో వెన్నెల కావాలి
నక్షత్రాలు భూమిపై వెలుగొందాలి
అంబేద్కర్ చూపుడు వేలే దిక్సూచి..
మానవులందరూ సమానమే..!

– డా॥ కత్తి పద్మారావు
సెల్:9849741695

## నూతనోత్సాహం

వస్తూ పోతున్నాయి
వత్సరాలెన్నో
వడి వడిగా వచ్చేస్తూ
వలపును పంచుతూ

నిత్య నూతనంగా
నిండు యవ్వనంతో
నిటారుగా నిలబడుతూ
నిజాల్ని గమనిస్తూ

సహజత్వాన్ని ఆహ్వానిస్తూ
సక్రమ మార్గాన్ని ఆశిస్తూ
సకల జనుల సంక్షేమం కోసం
సద్వినియోగ ఆశల కోసం

ప్రజల్లో మెదలుతూ
పర్యావరణ సంరక్షణ చేస్తూ
ప్రగతిని సూచిస్తూనే
ప్రాచీనతను కాపాడాలంటూ
వస్తూ పోతున్నాయి
వత్సరాలెన్నో
వడి వడిగా వచ్చేస్తూ
వలపును పంచుతూ...

– సుతారపు వెంకట నారాయణ
సెల్: 98489 58690



# చక్కని కవితల “పాల జున్ను”

ఆధునిక కవిత్వం ఇటీవల కాలంలో అనేక వస్తువుల్ని, అనేకానేక అనుభవ తోరణాలను, సంఘటనల్ని, సంఘర్షణలకు పురుడు పోసుకుంటోంది. కొత్త పుంతలు తొక్కుతున్న ఈ కవిత్వంలో నడక, నడత, బహుముఖీనంగా వ్యక్తీకరిస్తూ సామాజిక పరిణామాలకు అద్దం పడుతున్నది. తెలుగు సాహిత్యంలో మరో కొత్త కలం కొప్పోలు యాదయ్య. “పాల జున్ను’ పేరుతో వెలువడిన ఈ కవితా సంపుటిలో మానవత్వం, రాజకీయపు విలువ, తెలంగాణ భాషా సాహిత్యం, సంస్కృతిపై అభిమానం, సామాజిక దురాగతాలపై ధర్మాగ్రహం, మానవ విలువల కాపాడుకునే తీరు వంటి వస్తువులతో ఎంతో కొత్తగా ఉంది. సరళంగా, అందరికీ చేరువయ్యే రీతిలో సాగిన ఈ కవిత్వం వస్తువైవిధ్యం ఉంది. తీర్చిదిద్దే తీరులో నూతనత్వం కనబడుతోంది. అందుకేనేమో “ మనసు గాయపడితే / అక్షరాల జడివానలో తడిసి/ అభ్యంగన స్నానం చేస్తా” అంటారు .. ఆవేశపడినపుడు కవి, కవిత్వం రాయడం, ఆవేదన కలిగినపుడు నృత్యం చేయడం, ఆలోచనలతో చిత్రం గీయడం, ఆనంద సమయంలో సంగీతం ఆలపించడం వంటివి కళాకారులకు పరిపాటే. అదే కోవలో వీరు. “ఆశ ఒక అనంత శిఖరం/ ఎంత అధిరోహించినా కొంత మిగిలే ఉంటుంది/ చెలిమెల నీటిలా ఊరుతూనే ఉంటుంది” అనే వాక్యాలలో మనిషికి ఆశ అనేది శృతి మించితే ఎక్కడికి దారితీస్తుందో అని చెబుతూనే ఈ



వాక్యాలకు జీవం పోసారు. జీవితంలో ఆశ సహజం. కానీ ఆశే జీవితం కాకూడదు అని తెలియజెప్పే తీరు ఎంతో అర్థవంతంగా ఉంది.

అలాగే కేరళలో జరిగిన జల ప్రళయాన్ని చూసి చలించి **“ప్రకృతి అందాలను చూసి నీటికి కన్నుకుట్టినట్లుంది/ తాను సృష్టించిన భూత స్వర్గాన్ని / తానే మింగేసింది’** అంటారు. స్వేచ్ఛతో తాను అనుకున్న సత్యాన్ని విశ్వసించి గొంతెత్తి తన భావాలను తెలియజేసారు కవి కొప్పోలు యాదయ్య. ప్రజల పక్షం వహించిన కవిగా న్యాయం చేసారనే చెప్పాలి. మేడే ను స్మరించారు. శ్రమయేవ జయతే’ అన్నారు. అప్రజాస్వామిక తీరులో సాగుతున్న రాజకీయాల్ని ఎండగట్టారు. కవికున్నంత స్వేచ్ఛ మిగతా మాధ్యమాలకు ఉండవు అనేది ఇటీవల మనం గమనిస్తున్న విషయం. ఎందుకంటే కవి ఎవరికీ లొంగడు. ఎవరి బెదరింపులకు భయపడిపోడు. నీతి, నిజాయితీని నమ్ముకున్న కవి నిత్యం ప్రజలకు న్యాయం చేసే తీరులోనే ఆలోచిస్తూ ఉంటాడు. **“నిద్రాణంలో వున్న మరో మృగంలోని /పశుత్వానికి నేరాన్ని దగ్గర చేస్తున్నది/ మరి ప్రసారం చేయొద్దా? చేయాలి/ ఘోరాలకు పాల్పడే నేరస్తులకు/ కఠిన శిక్షలు ఖరారైనప్పుడు/ ప్రత్యక్ష ప్రసారం చేయాలి కదా? మరెందుకు** ఇన్ని ఆంక్షలు అని నిలదీస్తారు. చుట్టూ జరిగే సంఘటనలకు చలించిపోతున్న మనిషి తన భావాల్ని తెలియజేయడానికో లేక తనంతట తాను తెలుసుకోవడానికో కాదు కదా జీవితం. వీలయితే కాపాడే ప్రయత్నం చేయాలి లేదా కాపాడే వ్యవస్థకు అందించగలగాలి అనేదే వీరి కవితా ఆంతర్యం.

ప్రతులకు: కొప్పోలు యాదయ్య
ఫోన్: 9494273703



# సంప్రదాయాన్ని బతికించే “బతుకమ్మ మొగ్గలు”

ఏ దేవతను, ఏ దేవుడిని పూజించాలన్నా మనం మొదట ఉపయోగించేది పూలనే. కాకుంటే బతుకమ్మ అంటేనే పూలను ఆరాధించడం. పువ్వులను ఆరాధించే ఈ పువ్వుల పండుగ ఎంతో శోభాయమానంగా నిలుస్తుంది. అందులోను ఎవ్వరూ ఎప్పుడూ కనీసం ఒక పువ్వుగా కూడా గమనించని పువ్వులు తంగేడు, ఉమ్మెత్తలను కూడా పూలతో సమానంగా తీసుకుని అలంకరించడం వంటి సాంప్రదాయం ఒక్క తెలంగాణలోనే ఉంది.బతుకమ్మను ఒక దేవతగా తొమ్మిది రోజులు పూజించి బతుకునిమ్మని ప్రార్థించడం విశేషంగా వీరి మొగ్గల్లో తెలుపుకున్నారు. సృష్టికి మూలమైన స్త్రీమూర్తులు తమ పుట్టింటికి చేరుకుని సకల సౌభాగ్యాలు ఇమ్మని కోరుకోవడమే ఈ పండుగ విశిష్టత. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక బతుకమ్మ పండుగ ఒక రాష్ట్ర పండుగగా జరుపుకోవడం మనం గమనిస్తున్నాము. కుల, మత, వర్గ తారతమ్యాలు లేకుండా, ఎంతో ఆహ్లాదంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతిని ప్రపంచ స్థాయిలోకి కూడా విస్తరించిందని తెలుపుకోవడం అతిశయోక్తి కాదు.

కవి భీంపల్లి శ్రీకాంత్ కవిగా తెలుగు వారికి సుపరిచితులు. ఇటీవలే బతుకమ్మ నానీలు అనే లఘుకవితా సంపుటిని కూడా ఆవిష్కరించారు.





ఇప్పుడు బతుకమ్మ మొగ్గలు. మొగ్గలు ప్రక్రియకు భీంపల్లి సృష్టికర్త. మొగ్గలైతే రేపటికి వికసిస్తాయి కనుక రేపటి జీవితాలు ఎంతో విల్లివిరియాలని ఈ పేరు నిర్ణయించారేమో. ఇది మూడు పాదాల ప్రక్రియ. పాద నియమం తప్ప మరే నియమం లేదు. వస్తువు ఏదైనా తీసుకోవచ్చును. కేవలం మూడు పాదాలలోనే కవిత్వమంతా కనిపించాలని వీరి తాపత్రయం. నిజమే. ముప్పై వాక్యాలు రచించినా ఒక్క వాక్యంలో కూడా కవిత్వం కనిపించని ఈ రోజుల్లో ఈ ప్రక్రియను ఆహ్వానించాల్సిందే...ఇప్పటికే అనేకమంది ఈ ప్రక్రియలో కృషి చేస్తున్నారు. ఇటీవల మొగ్గల సంకలనానికి కూడా శ్రీకారం చుట్టారు. అభినందనీయం. ఈ సంపుటిలోని కొన్ని కవితా ప్రాధాన్యం కలిగిన పంక్తులు కొన్ని గమనిద్దాం...

**“సింగడిని తలపించే సిసలైనపండుగ బతుకమ్మ/ పల్లెపల్లెన ఆడబిడ్డల సంబురం మన బతుకమ్మ” // “మానవత్వానికి అసలైన చిరునామా బతుకమ్మ/ అనుబంధాల కలబోత బతుకమ్మ”**

**“ఊరువాడను ఏకం చేసే ఆడపిల్లల పండుగ బతుకమ్మ”**

**“నింగిలోని పాలపుంతలా వెలిగిపోతోంది బతుకమ్మ”**

**“తంగేడు పూలవనాన్ని తలపించే పండుగ బతుకమ్మ”/అడవిపూలతో ఈనిన నేలతల్లి బతుకమ్మ”/ /అనుబంధాల ప్రేమ మాలిక మా బతుకమ్మ పండుగ”**అంటూ బతుకమ్మ అందాల్ని, బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని అన్ని కోణాలలో స్పృశించి అక్షరాలతో బతుకమ్మను అలంకరించి మనకు అందించడం ఎంతో హర్షణీయం.

ప్రతులకు: భీంపల్లి శ్రీకాంత్
ఫోన్: 90328 44017



# కవిత్వ తోరణాలతో మెరుస్తున్న “గల్మ”

గల్మ’ గుమ్మానికి సరికొత్త మాండలిక పదం. మానవీయ మనోభూమికి నీళ్ళు అందించాలనే సంకల్పంతో యాదగిరి రూపొందించిన ఈ కవితా సంపుటి సరళంగా, సూటిగా ఉన్నాయి. యాదగిరి కవితలు సున్నితంగా సాగాయి. కవి స్వాప్నికుడు కావడం వలన అక్కడక్కడా ప్రతీకలు పరిపక్వమైనట్లుగా ఉండి మనసుల్ని పరవశింపజేయిస్తాయి. కవిత్వం ఎన్ని గ్రంథాలలో చదివినా తమదైన గొంతు ఖచ్చితంగా ఉంటుంది కనుక ఏ కవీ మరొక కవిని అనుకరించలేరు. వస్తువు తీసుకోవచ్చును కానీ శైలిని తీసుకోలేము. ఒకే విషయం గురించి మాట్లాడమని ఇద్దరికి అందిస్తే ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతారు. తమ అభిప్రాయాల్ని తెలియజేసినట్లే కవిత్వమూ అంతే..

యాదగిరి కవిత్వంలో నాకు ప్రత్యేకంగా కనిపించింది ధార. ఏ కవిత్వానికి ఆ కవిత్వమే ఎక్కడా తొట్రుపడకుండా సెలయేరులా జారిపోతున్న కవితా ధార. అనేక మంది రాసినట్లే సమస్యలు ఎక్కడైనా, ఎవరు రాసినా అవే. కానీ దాన్ని తలకెత్తుకునే తీరులో మార్పు ఖచ్చితంగా ఉంటుంది. అనడానికి నిదర్శనం “అమాయకత్వం” కవిత. ఐదేళ్ళకు వచ్చే నాయకుల్ని నమ్మకూడదని గట్టిగా చెబుతారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా దున్నేవాడికి భూమి లేదని, చదువుకున్నవాడికి ఉద్యోగం లేదని, రైతుకు న్యాయం జరగడంలేదని ‘ప్రజాస్వామ్యం’ కవితలో ఆవేదన



చెందుతారు. ఓటుకు నోటు అనే పంథాలో సాగుతున్న ప్రజల్ని అలా చేయవద్దని హెచ్చరిస్తారు. మనసులన్నీ లోహనదుల్లా ప్రవహిస్తున్నాయి అని వాపోతారు. మార్కెట్లో ఆఫర్లను నమ్మి మోసపోతున్న వినియోగదారులను హెచ్చరిస్తూ రచించిన కవిత “మాయాలోకం” ఎంతో వాస్తవంగా సాగింది. కృంగిపోతున్న వ్యవసాయం పట్ల ఎంతో ఆవేదన చెంది ప్రాజెక్టులు కట్టి తీరాలని గట్టిగా చెబుతారు. రైతుకు స్వర్గం ప్రాజెక్టులే కనుక వాటి నిర్మాణానికి ఏమాత్రం ఆలస్యం జరగకూడదు అంటారు. ఇవి కాకుండా స్త్రీ హృదయాన్ని తెలిపే తీరులో ఎంతో అభిమానాన్ని చూపుతారు. ముఖ్యంగా శ్రామిక స్త్రీలకు పెద్దపీట వేస్తారు. నిత్యం శ్రమించే శ్రామిక స్త్రీల పట్ల వీరి దృష్టి పెట్టారు. అంతేకాకుండా “ఆత్మఘోష” కవితలో వృద్ధాశ్రమంలో పెద్దలు పడే ఒంటరితనాన్ని విశదీకరిస్తారు. ఇంటిపట్టున ఉండి తనవారితో ఆనందంగా గడపాలనుకునే పెద్దల్ని అలా వదిలేయడం ఎంతో తప్పు అని వాదిస్తారు. తల్లి తండ్రులు అనాధలు కారు అని తెలిపే విధానాన్ని ఎంతో ఆర్ధ్రతగా రచించారు.

యాదగిరి కవితలు కేవలం గ్రామీణ జీవితమే కాదు నగర జీవితాలకు కూడా అద్దం పట్టాయి. రాత్రి కాగానే చీకటి దుప్పటి కప్పుకున్న నగరాన్ని వర్ణించడం చూస్తుంటే కవిత్వానికి వర్ణన ఎంత అవసరం అనిపించక మానదు. చుక్కల పందిరి, లాంతరు దీపాలు, మబ్బుల్లేని ఆకాశం, ఏకాంత గర్భగుడి ఇలా అనేక వర్ణనాత్మకమైన పదాలను మనకు అందించారు. రక్త సంబంధాలు, గురువులు, తెలంగాణ మహాకవి కాళోజి, శతృవులు, మిత్రులు ఇలా అన్ని విషయాలపై విపులీకరించి రచించిన కవి గంభీరావుపేట యాదగిరి.

ప్రతులకు : గంభీరావుపేట యాదగిరి.
ఫోన్: 94406 17611



# సహజమైన వాట్సప్ కవితా “పుప్పొడి”

నేడు వాట్సప్, ఫేస్‌బుక్ పుణ్యమా అని అనేక మంది కవులు పుట్టుకొస్తున్నారు. తమ భావజాలాన్ని సాంఘీక మాధ్యమాల ద్వారా అనేక మంది బయటపడుతున్నారు. కానీ ఇది కవితా కాదా? కథా కాదా? అసలు దేనిని కవిత అంటారు? కవిత్వం అంటే ఏమిటి? అనే అర్థాలు తెలియకుండానే మంచి కవిత్వాలను అందిస్తున్నారు. అలాంటి కవిత్వాలను ఏర్చికూర్చి కవితా సృజనతో ప్రపంచం నలుమూలలనుండి వస్తున్న సాహిత్యాన్ని కవితా సృజన చేస్తున్నారు. ఆ తర్వాత నిర్విరామంగా ఒకరినుండి మరొకరు ప్రోత్సాహాన్ని అందుకుంటూ సాగిపోతోంది. ఆ తర్వాత “తెలుగు పూలతోట” వాట్సప్ సమూహం ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అందరినీ ఒకచోట కలిసేలా ఏర్పాటు చేసారు. మార్చి 3, 2019 నాడు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కవిసమ్మేళనంలో పాల్గొని తమ కవితలు వినిపించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ కవితలన్నీ ఒక సంకలనం చేసారు. ఈ గ్రంథం “తెలుగు పూలతోట” సమూహ కవులకు సంబంధించినది. వారి కలం నుండి రాలిన పుప్పొడి ఈ కవితలు.

ఇందులో 51 కవితలున్నాయి. వివిధ రకాల వస్తువులతో, తమదైన శైలితో రూపొందుకున్న ఈ గ్రంథంలో దాదాపుగా అందరూ కొత్త కవులే. వీటిలో కొన్నింటిని, కవిత్వ ఆంతర్యాన్ని అర్థం చేసుకున్న కవుల్ని స్పృశిద్దాం.. ప్రేమ కవితలు చాలా మంది రాస్తారు. కానీ అందులో అంతర్లీనంగా ఆరాటం తప్ప మరేమీ కనిపించదు. కానీ బోలయాదయ్య





రచించిన “ఆమెకు నేనేమి ఇవ్వగలను” అనే కవితలో ఆర్తి ఉంది. అన్నింటికంటే తాను ప్రేమించిన ‘ఆమె’ పై విలువ కనిపించింది. **“ఆమె ఎప్పుడైన/ రెండు ఆత్మీయ వాక్యాల నడుమ/ తానొక పువ్వుల బాటై/ నాకు ఎదురొస్తది./ మా అమ్మ నాన్న అలిగి తారలై వెళ్ళిపోతే/ అన్నీ తానై నాకు కన్నీళ్ళ దీపమై వెలిగింది/ ఆమెకు నేనేమివ్వగలను/ గుప్పెడు గుండెలో పూసిన/పదాల పుష్పాలను కోసివ్వడం తప్ప”** వాక్యాలు సజీవంగా ఉన్నాయి. అలాగే సర్వరాజ్ అన్వర్ రచించిన కవిత “నీడే నా అస్తిత్వం” లో గాఢత దాగుంది. **“రాత్రింబవళ్ళు నన్ను అంటిపెట్టుకొని/ నా నడక, నడతలోని లోపాల్ని ఎత్తి చూపే/ సంస్కార ప్రతిబింబ దర్పణం జగత్తు/ నా నీడ నా సంస్కృతి, సంస్కారాలకు గుర్తు”** అనడం బావుంది. **హరీష్ కుమార్ శర్మ కవిత “నేను” “తాత్త్విక దర్శనంలో అంకురం నేను/ మరో ప్రపంచాన్ని ఊహల్లో దర్శిస్తూ/ అంతర్మథనంతో శోధించే మౌనమునిని నేను”** అంటారు. ఈ కవితలో ఆత్మస్థైర్యం ఉంది. అలాగే రాచమళ్ళ మల్లికార్జున్ కవిత “తెలుగు వెలగాలి”అనంత మోహనకృష్ణ కవిత **“ఆత్మబంధువు”** సురమోని శ్రీశైలం **“జోడెద్దులు”** చిగురాల్ ప్రసాద్ శ్రీ కవిత **“శ్రీ కవనాలు”** పద్మజ కవిత **“బాపూ మళ్ళీ రావాలి”** లాంటివన్నీ సరళంగా సాగినా వాటి ఆంతర్యం ఎంతో ఉన్నతంగా ఉంది.

కవిత్వం మనల్ని అనుసరించే వస్తువులే ఉంటాయి దాదాపుగా. నవ్వుతూ ఎదురయ్యే ముఖాలు కొన్నయితే నిప్పులు చెరిగేవి కొన్ని ఉంటాయి. అంతమాత్రాన వాటివంకే చూడటం అంటే భవిష్యత్ వ్యవస్థపై పోరాటం జరుగుతందన్నమాట. అదే ఆలోచనలో విప్లవి కవిత “ఆదమరచి” లోని వాక్యాలను గమనించండి “ మళ్ళీ జన్మిస్తాను అక్షరంగా/ కణకణాల్లోంచి లక్ష అక్షర రాశులుగా /మస్తిష్కం చీల్చుకొని మరో జన్మ ఎత్తగా/ దిక్సూచిగా దీనుకలు దారి చూపేందుకు..” అనే వాక్యాలు మనలో ఎంతో వాస్తవానికి దగ్గర చూస్తాయి,

అలాగే వడిచర్ల కవిత **“మణిపూసలు”** విఠలాపురం పుష్పలత కవిత **“రెండక్షరాలు”**జి. నరేష్ కుమార్ కవిత **“ఇంకో హృదయం కావాలి”** మేడమోని అలివేలు కవిత **“మన తెలుగుభాష”** లాంటివాటిలోని శైలి ఎంతో నూతనంగా అనిపించింది. చక్కని కవితలన్నింటినీ ఒక చోట చేర్చి ఒక సంకలనంగా తీర్చిదిద్దిన “తెలుగు పూలతోట సాహిత్య వేదిక” కు అభినందనలు.

ప్రతులకు: వెన్నెల సత్యం
ఫోన్: 9440032210

# ‘అమ్మ మనసు’ మినీ కథా సంపుటి ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో రచయిత పఠాన్ షహనాజ్‌బేగం, రమణ వెలమకన్ని, డా॥వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, తదితరులు.

పఠాన్ షహనాజ్‌బేగం (అనంతరపురం) రచించిన 11 మినీ కథల 54 పేజీల పుస్తకం ఆవిష్కరణ సభ గానసభలో జరిగింది. జీవితంలోని అనుభవాలను, సంఘటనలను ఇతివృత్తాలుగా తీసుకుని కథలుగా రాయడం జరిగిందని పఠాన్ పేర్కొన్నారు. ధార్మిక భావాలు జీవితానికి వెలుగు నిస్తాయని ఆమె పేర్కొన్నారు. మొత్తం 8 పుస్తకాలను ఆమె ఇప్పటివరకు వెలువరించారు. డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పుస్తకాన్ని ఆవిష్కరించి అమ్మ మనసు ఎప్పుడూ కమ్మనైనదే అన్నారు. మంచి కథలు రాసిన రచయిత్రిని అభినందించారు. రమణ వెలమకన్ని, జనార్ధనమూర్తి పాల్గొన్నారు.



డిసెంబర్ 27న త్యాగరాయ గానసభలో ‘అక్షరాస్త్రం’ కవితా సంపుటి ఆవిష్కరణలో కవి తెలుగు తిరుమలేష్‌ని సత్కరిస్తున్న అతిథులు ఏ.సురేందర్, ఏ పుష్పలత, మహంకాళి శ్రీనివాసులు, షాబుద్దీన్, డా॥ నాళేశ్వరం శంకరం, బైస దేవదాసు, అల్లం నారాయణ, డా॥ ఏనుగు నర్సింహారెడ్డి, డా॥పత్తిపాక మోహన్, దాస్యం సేనాధిపతి, డి. స్వర్ణరెడ్డి.



# సుగంధ పరిమళం ఈ “స్పందించే హృదయం”

మనిషి జీవితం కొన్ని నవ్వులు, కొన్ని కన్నీళ్ళు, కొన్ని స్పందనలు, కొన్ని వాదనలు, కొంత స్వార్థం, మరికొంత ఆనందం కలగలిపిన ఒక దృశ్యం. శ్రీమతి నామని సుజనాదేవి కథలు నిజంగా సుగంధ పరిమళ గుచ్ఛాలు. మంచి కథానికలు, కవితలు రచించిన మంచి రచయిత్రి. మంచి వక్త, అన్నింటికంటే ముఖ్యంగా మనసున్న వ్యక్తి. ఈ సంపుటిలో నూట ఎనిమిది కథలున్నాయి. పెద్దవారినుండి, భావి తరాలవరకు ఇందులో పాత్రలు పురుడుపోసుకున్నాయి. వీరి కథల్లో వృద్ధాప్యం, దాంపత్యం, ప్రేమ, పిల్లలు, మెరుపు, సూక్ష్మ కథలు ఒకటా రెండా ఎన్నో విషయాలతో ఎందరికో మార్గదర్శకంగా తీర్చిదిద్దబడ్డాయి. వీరి కథలు అనేక పత్రికలకు, రేడియో, నాటికలు ప్రదర్శనలే కాకుండా మీడియా కథకులుగా కూడా పేరెన్నిక గన్నారు. వీరి ప్రతి కథలో ఎంతో శ్రద్ధ కనిపిస్తుంది. ఉమ్మడి కుటుంబంలోని అన్ని వయసుల వారికి సంబంధించిన కథలన్నీ ఇందులో చోటు చేసుకున్నాయి. 108 సంఖ్య ఆధ్యాత్మిక పరంగా ఉన్నతమైన సంఖ్యగా గుర్తించి ఈ సంపుటిని 108 కథల సంపుటిగా తీర్చిదిద్దడం విశేషం.

కథలన్నీ మనిషి జీవితం నుండే పుడతాయి. మనిషి వికారాలనుండే ఆవిర్భవిస్తాయి. ప్రతి సంఘటన ప్రతి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు జరుగుతూనే ఉంటుంది. అందుకే రావిశాస్త్రి గారు అంటారు రచయిత(త్రు)లు జీవితానికి దగ్గరగా పరిశీలించాలి అని. ఈ సంపుటిలో ఏ కథకు ఆ కథే ప్రత్యేకం. మనిషి తాను జీవించినంతకాలం తనను తాను పోషించుకున్నా





ఎదుటివారికి చేతనయినంత సాయం చేయాలనే విషయాన్ని కూలంకుషంగా తెలిపే కథ “నేను సైతం” ఒక సందేశాత్మకంగా సాగింది. మనిషి బతికి ఉన్నంతవరకు తమ వ్యక్తిగా భావిస్తూ, చనిపోయాక అంటరాని శరీరంగా బావించే సొంత ఇల్లు, తోబుట్టువులకు సమాధానంగా ఒక ఆసరాభవనాన్ని నిర్మించి సందేశాన్నిచ్చిన కథ “స్వర్గధామం. ఎంతో వాస్తవంగా ఉంది.

మంచి ఉపాధ్యాయుడు తన పదవీవిరమణ అనంతరం తీసుకున్న నిర్ణయాన్ని తెలిపే గొప్ప కథ “గురుదక్షిణ’ ఎంతో ఆత్మీయంగా ఉంది. ఇవే కాకుండా పసిపిల్లలకై కథలు, గ్రామజీవితంలోని కష్టాలు, కన్నతల్లి ఆప్యాయత, భర్త లేకున్నా ధైర్యంగా బతికే భార్యల కథలు, మానవత్వం పంచిపెట్టే కథలు, టెక్నాలజీ పెరిగిపోయినా ఇంకా ప్రేమ అనేది ఉందని, ఇంకా బతికే ఉందని నిరూపించే కథ వంటి ఆణిముత్యాలు ఈ సంపుటిలో చోటుచేసుకున్నాయి. తల్లి కూతుళ్ళ బంధం, భార్యాభర్తల అనుబంధం, స్నేహితుల మధ్య అవగాహన, పసివారి వెన్నలాంటి హృదయావిష్కరణ ఎంతో అద్భుతంగా ఈ రచయిత్రి మన కళ్ళముందుంచేరు. ఒక రచనకు ఉండాల్సిన అన్నీ లక్షణాలు కలిగి, తన హృదయ స్పందనని బాల్యం, యౌవనం, కౌమారం, వృద్ధాప్యం వంటి నాలుగు దశలకు పంచి మన ముందు అమృతాన్ని పంచిన ఈ రచయిత్రి కథలకు నీరాజనం..

ప్రతులకు : నామని సుజనాదేవి
ఫోన్: 7799305575, 9247177004



-శైలజామిత్ర
9290900879





# కవిగా గెలిచి ఓడిన అలిశెట్టి

**వేశ్య**

తను శవమై...
ఒకరికి వశమై..
తనువు పుండై..
ఒకడికి పండై..
ఎప్పుడూ ఎడారై..
ఎందరికో ఒయాసిస్సై..

సామాన్యుని ఆక్రందనలను, ఆర్తనాదానాలనే తన కవితా వస్తువుగా చేసుకొని, అదే సామాన్యుని భాషలో, పేదవాని గొంతుకను చేసుకొని కవిత్వాన్ని స ృష్టించి, దానికి సాహిత్య గౌరవాన్ని తెచ్చిన అల్పజీవి అలిశెట్టి ప్రభాకర్ జ్ఞాపకాలు, మాటలు ఇంకా తెరమరుగు కాలేదు.

ఎప్పుడో నాలుగు దశాబ్దాల కింద తనకు తోచిన ఏడెనిమిది పదాలతో కవిత్వం రాసిన ఈనాటికీ సామాన్యుల నుండి విశ్వవిద్యాలయ మేధావుల వరకు అందరూ తమ పెదాలపై నిలుపుకొన్నారంటే ఆ పదాలలో ఉన్న ఆర్ద్రత, వేడి, మర్మగర్భ వ్యంగ్యం ఎంత గాఢంగా మనసులకు హత్తుకొందో తెలుస్తుంది.

కవిత్వం అంటే మహా పండితుల కాలాల నుండే వస్తుందనుకునే రోజుల్లో ఇంటర్మీడియట్ చదువు కూడా పూర్తి చేయని అలిశెట్టి, సామాన్య జనాల నుండి వచ్చిన మహాకవి. హృదయాన్ని కదిలించడానికి ఏదో ఒక సంఘటన చాలని, మనిషి జీవిత గమ్యాన్ని నిర్దేశించగలిగేది కూడా అలాంటిదే కావచ్చని చెప్పడానికి అలిశెట్టి పుట్టి, పెరిగిన జగిత్యాలలో సామాన్య రైతులు, రైతు కూలీలు జరిపిన ఒక జైత్రయాత్ర అలిశెట్టిని ఎంతగా ప్రభావితం చేసిందో, అతని తరువాతి కాలంలో వచ్చిన రచనలు, అతను ఎంచుకొన్న జీవన సరళి ఈ ప్రపంచానికి తెలియజేప్పింది.

ఉన్నత మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా, సమాజం పట్ల తనకు ఏర్పడ్డ అవిభాజ్య ప్రేమానురాగాలను వదులుకోలేక, తాను అలాంటి నిర్భాగ్యునిలా, తనకు తాను ఒక సామాన్య జీవిగా, ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు. ఎన్నడూ అహంకారపూరిత గొప్పదనాలకు, అనవసర ఆడంభరాలకు పోకుండా,తనకు తానే శిక్షవేసుకొన్న యోగి లాంటి వాడు.

భారతదేశంలోని ప్రజలలో సగానికి పైగా వేసుకోవడానికి బట్టలు లేని రోజు నేను ఎందుకు సూటుబూటు వేసుకోవాలని తనను తాను ప్రశ్నించుకొన్న మహాత్మాగాంధి, పై పంచే లేకుండా, పంచెకట్టుతో ఉంది పోతున్నట్లు ఆనాడెన్నాడో ప్రకటించుకొన్నాడు. అలాగే అలిశెట్టి కూడా తన చుట్టూ ఉన్న దారిద్రనారాయణులను చూస్తూ, వారి ఆకలిని తీర్చలేని తన అశక్తతకు చింతిస్తూ కూర్చోలేక పోయి, తన బాధ్యతగా వారి బాధను, కష్టాలను తన బాధగా అర్థం చేసుకొని చిట్టిపొట్టి మాటలతో కవితా రూపంలో ఈ చెవిటి లోకానికి చెప్పాలని ప్రయత్నించాడు.

చెవిటి లోకం వినలేదని అర్థం చేసుకొన్నాడేమో, తరువాతి కాలంలో తన కవితలకు చిత్ర రూపం ఇచ్చి కళ్ళకు కట్టేట్లు చేశాడు. కానీ వాటిని కూడా ఈ గుడ్డి లోకం సరిగా చూడలేక పోయింది. సమాజంలోని కుల్లును సూటిగా, నిష్కపటంగా చెప్పినా అర్థం చేసుకోలేదని, కొన్ని సార్లు మర్మ గర్భంగా, వ్యంగంగా చెప్పాడు. కుల, వర్గాల ఇజాలూ, వాదాలు ఇంకా పూర్తి స్థాయిలో పురుడు పోసుకొని నాడే, దళిత, స్త్రీ, బలహీన వర్గాల, యువత, నిరుద్యోగులు పడే కష్టాలను ఎంతో ఆర్ద్రంగా, గుండెబరువెక్కెలా చిత్రించిన మేధావి ప్రభాకర్.

మేధావుల మధ్యనే ఉంటూ, మేధావుల, విశ్వవిద్యాలయాల రాజకీయాలతో, ముఖ్యంగా సాహితీకారుల సాహిత్య రాజకీయాలతో విసిగివేసారి పోయిన ప్రభాకర్, కొంతమంది సాహిత్యకారుల పొడనే తాకకుండా ఉంటూ, వారిలోని కుహనా ప్రేమను, ప్రగతివాద, ప్రజాస్వామ్య విలువలను ఎండగట్టాడు. నిజమైన కవి అంటే ఈ సమాజం పట్ల నిజమైన నిజాయితీతో ఉండాలన్నేది ప్రభాకర్ ఆశయం. తాను నమ్మిన దానికి, అది తన జీవితాన్ని, శరీరాన్ని, కుటుంభాన్ని ఎంతగా ఛిద్రం చేసినా, విడవకుండా, తన ఆశయాలకే తాను బలయ్యాడు.

ప్రభాకర్ రాసిన కవితలు ఒక ప్రభాకర్ కె కాకుండా, ఆనాడు చీదరించుకోబడ్డ అనేక మంది సామాన్య బడుగు కవుల రచనలకు సాహిత్య గౌరవాన్ని సంపాదించిపెట్టి, వారి రచనలకుపత్రికల్లో స్థానం కల్పించింది. కలలో భ్రమింప చేసే నవలలు, క్షుద్ర సాహిత్యం, నేర ప్రవ ృత్తిని ప్రేరేపించే సాహిత్యమే గొప్పదని బావిస్తున్న కాలంలో కవిత్వం అంటే సంస్కృత సమాసాల తో ఉండే అర్థం కానీ వచనమే కవిత్వం బంధనాలనుండి విడివడి, కొత్త రెక్కలు తొడుకొంటున్న వచన కవిత్వంలో కూడా మళ్ళీ చిన్నాపెద్ద రచయితలు అనే భేధాన్ని ప్రదర్శించే సాహిత్య లోకంలో దిగంబర కవుల రచనలచే ప్రభావితం అయిన ప్రభాకర్, మరెందరికో అభిమాన కవి అయ్యాడు.

అతి సాధారణ పదాలతో, పిసినారిగా అతి తక్కువ పదాలతో ప్రభాకర్ రాసిన చిట్టి పొట్టి కవితలే సిటిలైఫ్ గా మారి, ప్రపంచాన్నే కుదిపేశాయి. అంతకు ముందే, గుండె పిండేసే స్త్రీ ఆర్తనాదానికి కదిలిపోయి రాసిన " వేశ్య" కవితను ఊటకించకుండా, ఆనాటి నుండి ఈనాటి వరకు ఏ సభలో కూడా స్త్రీల పట్ల సమాజంలో ఉన్న స్థానం గురించి ప్రసంగించే వక్త లేకపోవడం ఆశ్చర్యం కాదు. ఆ కవితలో స్త్రీగా తన మనసును గుండె రాయి చేసుకొని, పశువు లాంటి పురుషునికి సుఖమిచ్చే యంత్రం లోని మనసు భాషను ఎంతో ఆర్ద్రతతో పలికించిన గొప్పతనమే అది. " తాను శవమై– తనువు పుండై– ఒకరికి పండై– ఎందరికో ఒయాసిస్సు లామారి పోయిన అభాగ్యురాలి ఆత్మ కథను ఈ కవితలో ఎంతో గొప్పగా ఆవిష్కరించిన ఘనత ప్రపంచానికి అతనిలోని కవిని పరిచయం చేసింది.

మహానగర జీవితాలలోని కుల్లును ఒంటబట్టించుకోకుండా, తన చిన్ననాటి మాయామర్మం తెలియని మనసుతో తన చుట్టూ ఎప్పుడు పది మంది స్నేహి తులతో గడిపినా, వారిలో తాను కోరుకొనే సామాజిక మార్పును, స్నేహాన్ని మాత్రమే కోరుకొన్నాడే కానీ వారి నుండి ఎప్పుడు సన్మానాలు, మెప్పుకోలు ప్లాస్టిక్ నవ్వుల పువ్వుల శాలువాలను కోరుకోలేదు. నగర జీవితంలో నిజాయితిలేదని తెలిసినా, నగరంలో ఉన్న మేధావులంతా, మనసు చంపుకొని, రాత్రి ఎవరో ఇచ్చే మందు పార్టీకి తమ నిజాయితిని తాకట్టు పెడుతున్నారని, మనసులోనేకాదు తన రచనలలో కూడా వాపోయాడు. తన బాధను ఏదో ఐహిక సుఖాలకొరకు, లేని గౌరవానికొరకు తాకట్టు పెడుతున్నారని ముఖం మీదే చెపుతూ, అలాంటి వారు ఎంత గొప్పవారైనా తన స్నేహానికి అర్హులు కారంటూ దూరం ఉంచాడు. మరిలాంటి నిఖార్సైన మనుషులు ఈనాడు మనకు కనబడుతారా?

సమాజంలో చెడును, రాజకీయ మోసాలను, స్నేహితులలో ఉండే కల్మశాన్ని ఎంతో ఈజీగా గుర్తించే గొప్ప వివేకవంతుడు ప్రభాకర్. కానీ, ఎన్ని సుగుణాలున్నా, జీవితంలో తనకంటూ ఒక క్రమశిక్షణ లేకుంటే తన చేతలకే తాను ఎలా బలై పోతాడో తానే ఒక ఉదాహరణగా కవితలో చెప్పుకొన్నాడు. ప్రభాకర్ చివరికి ఒక జ్ఞాపకంలా మిగిలిపోయాడు. అతని రచనలు మాత్రం రాబోయే ఎన్నో తరాలకు, సాహితీ కారులకు ఓనమాలు దిద్దిస్తుంటాయి. ఎంతోమంది పరిశోధకులకు కొరకరాని కొయ్యల్లా, ప్రతి పఠనంలో కొత్త అర్థాలు, మర్మాలు విప్పి చెపుతాయి.



**–సిహెచ్ వి ప్రభాకర్ రావు**
సీనియర్ జర్నలిస్టు
9391533333



**పోరాటం**

పురుషాహంకార సముద్రం మధ్యన
చిక్కి
తల్లడిల్లితే ఒక రమణీయ ద్వీపం
వరకట్న దురాచారపు అంధకారంతో
పోరేందుకు
సమాయత్తమైందొక చిరుదీపం



## అలిశెట్టి స్మరణలో...

ఈ ఫోటో 12 జనవరి 2012 నాటిది. 1993లో అదే తేదీన అసువులు బాసిన జనకవి అలిశెట్టి ప్రభాకర్ సంస్మరణ సమ్మేళన సందర్భమిది. హైదరాబాద్ నగరం హైదర్‌గూడ ప్రెస్‌క్లబ్‌లో 19 ఏళ్ల విరామం తర్వాత ప్రభాకర్ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నది.

అలిశెట్టి ప్రభాకర్‌కు బైస సోదరులతో, నేటినిజం పత్రికతో అనుబంధం కుటుంబ బంధంగా ఆజన్మాంతం కొనసాగింది. ఆ తర్వాత ప్రభాకర్ అక్షర కాంతిని వెదజల డాన్ని నేటినిజం తలమానికంగా భావించింది. ఆ క్రమంలోనే ప్రభాకర్ జయంతి, వర్థంతిని స్మరిస్తూ అలిశెట్టి కవితలతో విశేష సంచికను విడుదల చేసింది. ఆనాటి సంస్మరణ వేదికపై ఆ సంచిక ఆవిష్కరణానంతరం ఆ సంచిక ప్రతులను సభికులందరికీ పంపిణీ చేయడం జరిగింది.

ఫోటోలో ఉన్నవారు వరుసగా ఎడమ నుండి నిజాం వెంకటేశం, వరవరరావు, పద్మజ, ప్రభాకర్ భార్య భాగ్యం, తల్లి అలిశెట్టి లక్ష్మి, జింబో, అల్లం నారాయణ, జయధీర్ తిరుమలరావు, ఘంటా చక్రపాణి, రమేష్ హజారీ.

దీర్ఘ కాలానంతరం ప్రభాకర్‌ను జ్ఞాపకం చేసుకున్న ఈ సందర్భంలో నిజాం వెంకటేశం ఓ కీలకమైన ప్రకటన చేశారు. వచ్చే సంవత్సరం అనగా 12 జనవరి 2013నాడు ఇదే వేదికపై ప్రభాకర్ మాతృమూర్తి చేతుల మీదుగా అలిశెట్టి ప్రభాకర్ రచనల సమగ్ర సంపుటిని విడుదల చేస్తామన్నది ఆ ప్రకటన సారాంశం.

ఆయన వాక్కు కార్యరూపమై చెప్పిన రీతిలోనే అలిశెట్టి ప్రభాకర్ కవిత వెలువడింది. జగిత్యాల, హైదరాబాద్ అలిశెట్టి మిత్రుల పూనికతో వచ్చిన ఈ సంపుటి ప్రభాకర్ కవిత్వాన్ని నేటి తరానికి అంది స్తోంది.

ఫోటోగ్రఫీ, ఛాయాచిత్ర సంగ్రహణలో అమిత ఆసక్తి, అభిరుచిగల బైస దేవదాసు భద్రపరిచిన ఈ ఫోటోకు ఓ చారిత్రక సందర్భముంది. ప్రభాకర్‌ను మళ్లీ స్మరణలోకి తేవడమే దీని విశేషం.

**– బి.నర్సన్,**
సెల్: 9440128169



డిసెంబర్ 28న శ్రీత్యాగరాయ గానసభ మెయిన్‌హాలులో జి.వి.ఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన టి.వి. నటీనటుల అవార్డుల ప్రదానోత్సవ సభలో డా॥కె.వి.రమణాచారిచేతులమీదుగా పురస్కారాన్నందుకున్న లత, ప్రగతి, నవీన, యాటి, శ్రీదేవి, కల్కి, రాజ, జె.ఎల్.శ్రీనివాస్, మీర్ హుస్సేన్, దేవిరెడ్డి, యన్.చిరంజీవి, గుమ్మడి ప్రేమ్‌చంద్, గువ్వారు చంద్రమోహన్, మౌనశ్రీమల్లిక్, నామాల రవీంద్ర సూరి, యం.వి.కె.మల్లిక్. చిత్రంలో చిల్లా రాజశేఖర్‌రెడ్డి, లంక లక్ష్మీనారాయణ, రామరాజుశ్రీనివాసరావు, యలవర్తి రాజేంద్రప్రసాద్, సంస్థ అధ్యక్షులు గుదిబండి వెంకటరెడ్డి, సంస్థ కార్యదర్శి వి.వి.రాఘవరెడ్డి, పెద్దూరి వెంకటదాసు తదితరులు.



సోమవారం సాయంత్రం కళా సుబ్బారావు కళావేదికలో కోట శ్రీరామమూర్తి రచించిన 'నీతి సుధాలహరి' పుస్తకావిష్కరణలో నృత్యాలు ప్రదర్శించిన కె. రాధిక శిష్య బృందంతో అతిథులు. బి. సత్యనారాయణ, తంగిరాల నరేష్, కోట శ్రీరామమూర్తి, బైస దేవదాసు, కె.రాధిక, డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, దైవజ్ఞవర్మ, ఎం. లక్ష్మి, డా॥ కోట శ్రీధర్‌రావు.

**కాలం అడుగులు**

నిన్నటి పేజీలో
మార్పులు చేయలేం.
రేపటి పేజీలో
ఇప్పుడేం రాయలేం.
వర్తమానంలోనే
మార్పుచేర్పులేవైనా.
మానవ జీవితమే
ఓ కదిలే రంగస్థలం
మూడడుగుల నిడివిలో
కాలం తీర్చిదిద్దే కొలమానం.



**–ఆచార్య కదారు వీరారెడ్డి**
(9392447007)



**ఆహ్వానం**

సాహిత్య వేదిక మరియు తెలుగుపూలతోట
సంయుక్త నిర్వహణలో
ఉమ్మెత్తల యజ్ఞ రామయ్య
సాహిత్య పురస్కారాల ప్రదానం
కవి సమ్మేళనం
తేది: 12-01-2020 ఉ.10 గం.లకు
వేదిక: జడ్.పి. హైస్కూల్ (కుంటబడి), షాద్‌నగర్

సభాధ్యక్షులు
వల్లభాపురం జనార్ధన , ప్రజాకవి

**ఆత్మీయ అతిథులు**
బైస దేవదాస్, నేటినిజం (సంపాదకులు)
కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి (కాళోజి పురస్కార గ్రహీత)
డా.ఉమ్మెత్తల లక్ష్మీ నారాయణ (రిటైర్డ్ ప్రిన్సిపాల్)
రేమద్దుల దివాకర్ రావు (అక్షరాంజలి ఉపసంపాదకులు)
డా.కె. రాములు గౌడ్ (సాహితీ పరిశోధకులు)

**పురస్కార గ్రహీతలు**
శ్రీమతి కె. వీణారెడ్డి (కథ)
డా.టి.వి. భాస్కరాచార్య (పరిశోధన)
శ్రీ ఈతకోట సుబ్బారావు (వచన కవిత్వం)
శ్రీ జనజ్వాల (అభ్యుదయ కవిత్వం)
శ్రీ ఏదులపాపయ్య (పద్యం)
శ్రీ డి.ఎస్. బాబూదేవీదాస్ రావు (పద్యకవిత)
శ్రీ దుప్పల్లి శ్రీరాములు (నాటక రంగం)
శతావధాని శ్రీ మద్దూరి రామమూర్తి (అవధానం)
డా. భీంపల్లి శ్రీకాంత్ (సాహిత్య సేవ)

**నిర్వహణ**
వెన్నెల సత్యం
సర్వరాజ్ అన్వర్

అభినందనలతో..
శ్రీ ఉమ్మెత్తల

**నేటి నిజాలు**




**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని 5 సం॥రాలకు రూ.700/–, 10 సం॥రాలకు రూ 1200/– మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి–74, జవహర్‌నగర్, హైదరాబాద్–500 020.

## మెరుపులు

నరం మంచిగుంటే
కరం పనిచేస్తది
నవ్వు మంచిగుంటే
హృదయం పులకిస్తది !!

పాకం మంచిదైన
రుచి వచ్చు
పని మంచిదైన
పేరు వచ్చు !!

మాట కొత్తదైన
మనసు మారాలి
బాట కొత్తదైన
మార్గం చూపాలి !!

మంచి మాటలు
చెవిని పెట్టాలి
మంచి అడుగులు
గవిని దాటాలి !!

ఇల్లంటే అందమైన
సున్నంవేస్తే సరిపోదు
మంచి మనిషంటే
బట్టలేస్తే సరిపోదు !!

నూనె ఔషధంకాదు
తేనె లాగ
మనిషి పక్షికాదు
కోకిల లాగ !!

తల్లి పాలు
హానికరము కాదు
మందార పూలు
మకరందము కాదు !!

గండి కొడితే
నీరు ఉండదు
గంట కొడితే
బడి ఉండదు !!

పీక్కు తింటే
పిల్లలు కాదు
లాక్కు తింటే
అన్నం కాదు

మనసు విరిగిన
ఎన్నటికి అతుకదు
అద్దం పగిలిన
అసలే అతుకదు !!



-తాండ్ర చిరంజీవి
సెల్ : 9959180762

## కొత్త చరణం

గోడ మీదకు
కొత్త కేలండర్ వచ్చి చేరుతుంది
జీవితం చెట్టు మీద
మరో కొత్త కొమ్మ నవ్వుతుంది
నిన్నటి కొమ్మ మీద వాలిన
పక్షులన్నీ
మనసు గూటిలోకి
భద్రంగా చేరుకుంటాయి
కొత్త సంవత్సరమంటే
కొత్త పాట కాదు
నిన్నటి పాటకొక కొత్త చరణాన్ని
అతకడం
నిన్న కచేరీలోంచి లేచెళ్లిపోయిన
ప్రతి ప్రేక్షకుడినీ గుర్తుపెట్టుకొని
కొత్త రాగంతో
మళ్లీ ఆకర్షించడం
కచేరీ ఆఖరున
మన భుజం తట్టిన
మెత్తటి స్పర్శలను
శ్రోతల సమూహంలో
ముందు వరుసలో చూసుకోవడం
శృతిని సరిచూసుకుని
లయను సవరించుకుని
జీవన మధురిమల్ని
అందంగా పలికించడం
ఎంత సాధన చేసినా
అనివార్యంగా దొర్లే
అపశృతుల దగ్గరే
కూలబడిపోకుండా
బ్రతుకుపాటలోకి ప్రతి రాగాన్నీ
ఆహ్వానించడం
పల్లవి నుండి
చరణం చివరి వరకూ
ప్రతి అక్షరాన్నీ ఆస్వాదించడం
ప్రతి పదంలో స్పష్టంగా ధ్వనించడం
కొత్త సంవత్సరమంటే
కొత్త గమకం!
కోయిలా అదే!
చెట్టూ అదే!



- సాంబమూర్తి లండ
9642732008

## స్వాగతం

గతం చేతి వేళ్ళు సుతిమెత్తగా
వదిలి పెడుతూ,
నేటి నిజం,నింగి భవితవ్యాన్ని
అందుకోవాలని ప్రయత్నం.
జ్ఞాపకాల నెమలీకలను
భద్రంగా దాచి, గుండె గుమ్మంలో
ఎదురుచూస్తుంది కొత్తదనం కోసం.
నిన్నటికి,రేపటికి సంధి వారధిలా
నూత్న ఒరవడులకు సారథిలా

ఊహాల కుంచెతో బొమ్మలు గీస్తూ,
వూపిరి నింపిన కలల శిల్పం చెక్కుతూ,
ఘడియ అనే రాత్రి రెప్పలను తెరుచుకొని,
వెన్నెల పలువరుసతో ఆహ్వానిస్తోంది
కొత్త వత్సరం,
తెచ్చింది ఎంతో సంబరం.
కాలాల తలుపుల తాళాలు తీసి,
అనుభవాల ముడతల,
మడతలు సరిచేసి,
మరో అధ్యాయపు పేజీలలో
నలిగి పోయిన పాతని ,
ఆశల అక్షరాల నగిషీలు దిద్దాడానికి,
లక్ష్యాలను బ్రతుకు కాగితంపై
అందంగా రాస్తుంది,
భవ బంధాలను పెంచుతుంది,
సమ సమాజ నిర్మాణంగా,
స్వాగతిద్దాం వత్సరాన్ని సగౌరవంగా.



-సముద్రాల శ్రీదేవి
9949837743

## సహస్రారం

మనస్సు కు పరుగు సహజం
పరుగు ఎప్పుడు? ఆపదు
పరుగెత్తి పరుగెత్తి అలసినా
వయస్సు పరిహాసిస్తుంది
తనువు డస్సిందని విన్నవిస్తుంది,
నైజం మారని మనస్సుకు
వయసెక్కడుంది?
అశ్వమా కళ్లెం వేసేందుకు?
కలల కౌగిళ్ళలోకి జారిపోతుంది
ఉహల గున్న మావిళ్ళకి
ఊయలలు గట్టి ఊగుతుంది.
చికిలించే ప్రశ్నలకి
రామ జోలపాడుతుంది
కథల తాయిలాలు పెడుతుంది..
రేచక కుంభకాల బందీ విడిపించి
సహస్రారంపై కూర్చో పెడుతుంది
ఓ కొత్త ప్రపంచం
వేయిరేకుల పద్మమై వికసించి
ప్రియాతిప్రియంగా ఆహ్వానిస్తోంది...

-లలితా భాస్కర దేవ్
9885552922

## ఓ కొత్త వత్సరమా

"కొత్త సంవత్సరమా..'
కోటి ఆశల వత్సరమా..
కొత్త వెలుగులు వెలిగించు
చీకటి నిరాశలను తరిమికొట్టు
జీవితమనే భద్రత కల్పించు
అభద్రత భావాన్ని తొలగించు
కొత్త కొత్త చిగురులను చేతికందించు
"దేశాన్ని రోడ్డు రవాణా ప్రమాదాలు"
రైల్వే ప్రమాదాలు విమాన ప్రమాదాలు
బాంబు ప్రమాదాలు, అవినీతి, అసమర్థత
బలహీనత, పేదరికం నుండి
దేశాన్ని బలమైన శక్తిగా
నీతి, నిజాయితీ ధర్మంవైపు నడిపించు
సత్యమేవ జయతేను వర్ధిల్లింపజేయుము
ఓ కొత్త సంవత్సరమా..
కోటి ఆశల వత్సరమా..



-మియాపురం
శ్రీనివాస్ పూదూర్

## 2020

అమ్మాయీ!
నీకు 'ఇరవై' వచ్చాయి
మళ్లీ చెబుతున్నా
ఇరవై వచ్చాయి (2020)
ముందడుగు వెయ్యనివ్వని
అదృశ్య స్పర్శల ముళ్లు గుచ్చుకోకుండా
జాగ్రత్తపడు.
కామ భుజంగాలు పడగలు విప్పి
బుసలు కొడుతూనే వుంటై
ఆ బుసబుసల్ని విసిరి కొట్టేయాలి!
నీ అతివిశ్వాసం నీ శ్వాసని
ఏ క్షణానైనా చిదిమేయొచ్చు
వందమంది మధ్య ఉన్నా
ఒంటరితనపు రాక్షసి
వెంటాడుతూనే ఉంటుంది.
కలుపుమొక్కేదో, తలుసి మొక్కేదో
తెల్సుకొనే లోగానే
నీ గాజు బతుకుమక్కలైపోవచ్చు
ఒళ్లంతా కళ్లూ చెవులూ పేర్చుకోవాల్సిన
దౌర్భాగ్యపు కాలం
ఎవడ్నీ నమ్మకు
అన్న వరసైనా ఒకడు
నాన్న వరసైనా మరొకడు
ఎవడ్నీ నమ్మకు
ఇక్కడ మధ్యమే
రాజ్యానికి నైవేద్యమవుతోంది
మత్తుకు జగత్తుకు బానిసైపోతోంది
నిజం అర్థమయ్యేలోపల
హజం అసహజనటనతో
నిన్ను నిలువనా కబ్జా చేయొచ్చు
స్నేహం నటిస్తూ
దాహంగా చూసే చూపుల్ని దహించెయ్
నిర్భయంగా ముందడుగేస్తూ
దిశల్ని ధైర్యంతో కడిగేస్తూ...



- చిమ్మపూడి శ్రీరామమూర్తి
సెల్:9704177270

## తుమ్మల కవితలో సంక్రాంతి



తెలుగువారి సంప్రదాయ పర్వాలలో అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్న పండుగ సంక్రాంతి. తెలుగు వారి సంస్కృతికి ప్రతీక సంక్రాంతి. ముమ్మూర్తులా తెలుగుదనాన్ని వేషభాషలలో ప్రతిబింబించిన తెలుగు కవి తుమ్మల సీతారామమూర్తి చౌదరి.

రాష్ట్రసిద్ధి కొరకు రక్తంబుకార్చిన
కవిని నేను గాంధీ కవిని నేను
బడలి బడలి తల్లి భాషకూడెముసేయు
కవిని నేను దేశి కవిని నేను.

అని గర్వంగా చెప్పుకొన్న 'అభినవ తిక్కన' ఆయన. తెలుగువారు తెనుగులెంక, అన్న బిరుదమిచ్చి గౌరవించారు. తెలుగువారు సంక్రాంతి, పండుగను జరుపుకునే విధాన్ని తుమ్మలవారు హృద్యంగా వర్ణించారు. సంక్రాంతి ఆయన విశిష్ట ఖండ కావ్యాలలో ఒకటి.



'కొసరి నూరిన పచ్చి పసపుపూత మొగాన
గుమ్మడిపూదుమారమ్మునద్ది
కండరేగడ నారబండి కన్పండువై
పొలుచు మింపపుండు బొట్టువెట్టి
వలిపమ్మునకు నొక్కనాసి హెచ్చుయినట్టి
నునుమంచుతెర చీరనూలు కొల్పి
బంతిపూవులకు చేమంతి నెయ్యముగూర్చి
కబరీభరమ్ము చక్కన కుదిర్చి
పంటకళ్ళాలు మును బరాబరులు సేయ
గూడు కట్టిన తెలిమబ్బు గొడుగు నీడ
కదలి వచ్చెను భాగ్యాల కడలివోలె
మకర సంక్రాంతి లక్ష్మి హేమంత వీధి.

హేమంత ఋతువులో భాగ్యాల కడలి వలె కదలి వచ్చిన సంక్రాంతి లక్ష్మి వైభవాన్ని ఇంత అందంగా రస నిష్యందంగా వర్ణించిన కవి తుమ్మల ఒక్కరే.

మకర సంక్రాంతి వేళ నెలదప్పినట్టి కోడలి చేత ఒకయత్త
భోగి పొంగలి పూజ పూర్తి చేయించింది.
పుట్టినింటికి వచ్చినట్టి కూతుగులాబి చెక్కిళ్ళను
ఒక తల్లి చెనకి పుణికింది
మారు వడ్డించెడి మరదలు కెంగేలు పిసికి వల్దన్నాడు
ఒక పెంకెబావ
వంగి ముగ్గులుదిద్దు వధువుపై గదివీడి చనునొక్క గడుసుమగడు
నీరు చల్లినాడు
అప్పుడే వచ్చిన ప్రియుని సోయగాన్ని చూస్తూ తలుపు చాటుననున్న ఒక్క పైదలి చెమర్చింది.

సంక్రాంతి రాకతో జగమంతా మధుర మధురానురాగ సామ్రాజ్యమైందని కవి హృద్యంగా వర్ణించారు.

సంక్రాంతి పండుగనాడు తెలుగు వారిండ్లలో చేసే వంటకాలను నోరూరించే విధంగా వర్ణించారు తుమ్మల.

'లేగటి పాలలో గ్రాగి, మాగిన తీయ
తీయకప్పూర భోగి పాయసంబు
చవులూరు కరివేప చివురాకుతో గమ
గమలాడు పైరవంకాయ కూర
తరుణ కుస్తుంబరీ దళమైత్రిమై నాల్క
త్రుళ్ళుదుల్లెడు నక్కదోసబజ్జి
క్రొత్తబెల్లపు దోడికోడలై మరిగిన
మదురు గుమ్మడి పండు ముదురు పులుసు
జిడ్డుదేరిన వెన్నెల గడ్డపెరుగు
గరగరిక చాటు ముంగారు చెరకురసము,

పైన పేర్కొన్న సంక్రాంతి విందు భోజనాలు ఎంత రుచ్యంగా ఉంటాయో సహృదయులకు తెలుసు.

ఉత్తరాయణ పుణ్యకాలం శుభోదర్కం. పౌష్యలక్ష్మి రాకతో గ్రామీణ సౌందర్య శోభ ఇనుమడిస్తుంది.

'లేబొట్టతో పిసాళించు నామునకు న
క్కోరుదూడలు వెండి కొండలయ్యె
నిముసాన కొకసారి నిండునక్షయ పాత్ర
గాసి చేసాతాని గజ్జెవిప్పె
కల్లు పెల్లాని రంగము బెట్టె కాకలీ
నాదమ్ముపంట యేనాది జంట
ప్రాజీరవిడి మాలపడతి క్రొత్తలుకట్టి
సూచించె శిశిరర్తు సుదతిరాక
క్రొత్త కుసుమ కూడు కుత్తుకబంటిగా
బిచ్చగాని కుక్క పెచ్చరిల్లె

సంక్రాంతివేళ ఎన్నెన్నో సంబరాలు! ఎన్నెన్నో సుందర దృశ్యాలు! ఎన్నెన్నో సంప్రదాయాలు. మధురం, మనోజ్ఞం మకర సంక్రాంతి పర్వం తుమ్మలవారి కవిత్వంలో నయనాభిరామం.

తుమ్మల వారి సంక్రాంతి తెలుగువారి గుండెలలో నిలిచే ఓ మధుర ఖండకావ్యం.



- డా॥ తిరునగరి
సెల్: 93924 65475

## సంక్రాంతి పిలుస్తోంది

వస్తోంది వస్తోంది హేమంత ఋతువు
తోడుగవస్తోంది సంక్రాంతి పండువు
గుంటూరు పండుమిరప ఎర్రని కాంతులతో
బంతి చేమంతుల, పచ్చదనాల సొబగులతో
ఆవుపేడ గొబ్బెమ్మలతో, రంగవల్లులతో
హరిదాసుల హరి కీర్తనల మేలుకొలుపులతో
గంగిరెద్దుల ఆటపాటలతో, తోలుబొమ్మలాటలతో
చెరుకురసాల తీయదనాలతో
కోళ్ల పందేల కీచులాటలతో
ఎడ్లపందేల పోటీలతో, కమ్మనైన గుమ్మపాల కడవలతో
అందరికి సంబరాలు! మీ కందరికి వందనాలు!!

-యం. బాల గంగాధరయ్య,
9849546762



రైతన్న పంట ఇంటికొచ్చిన వేళ
సంతసంగ జరుపుకుంటడు సంక్రాంతి
ముచ్చటైన మూడు రోజుల పండుగ
మురుసుకుంట ఉంటరు పిల్ల జెల్లలంతా
చలి గాలులతో మొదలవుతుంది సంక్రాంతి
సంక్రుడిరాక, తెలుగుపల్లెకు ఆనందాల కేక
అతివలు ముంగిళ్ళను ముగ్గులతో నింపుతారు
గొబ్బెమ్మలు, రంగవళ్ళులతో అలంకరిస్తారు
బుడ బుక్కల వారు, పగటివేషధారులు
హరిదాసుల సందడితో పల్లెల్లో ఆనందాలు
బావి దగ్గర నుండి బండ్ల మీద ధాన్యం
మూలనున్న గరిసెలు నిండు ఇది సత్యం
గాలిపటాల గెలుపుతో ఆనందాల గోపాలం
అవధిలేని ఆనందాల్లో వసుధైక కుటుంబం
భోగినాడు భోగిమంటలూ తప్పవు

## సరదాల సంక్రాంతి

సాయం సంధ్యవేళ పిల్లలకు భోగిపళ్ళు తప్పవు
కొత్త అల్లుళ్ళ రాకతో అత్తగారిల్లు శోభాయమానం
మరదళ్ళు ఎకసెక్కాలలో ఉక్కిరి బిక్కిరి ఖాయం
ఎడ్ల బళ్ళు, కోడి పందాల జోరుతో పల్లె
అందరికవుతుంది ఆట విడుపు మల్లె.

- యాదువరం చంద్రకాంత్ గౌడ్
సెల్: 9441762105

## మా ఊరి సంక్రాంతి!

మా ఊరి ఆస్థాన విద్వాంసుల
మంగళ వాద్యముల రవళులతో
హరిదాసు హరినామ సంకీర్తనతో
మా ఇంట మకర సంక్రాంతి మొదలు!

ముత్తయిదులు ముద్దబంతులు
ముగ్గులు గొబ్బెమ్మలు తోరణాలతో తయ్యారు!
గంగిరెద్దోళ్ళూ పిట్టల దొరలూ పగటేషగాళ్ళూ
పండగ మేమూ జరుపుకోవాలి సొంతవాళ్ళతోనని
వడి వడిగా వీధులన్నీ తిరిగేస్తూ ఏ ఇంటా ఆగక!

మా మాష్టారికి పూజారికి చిరు వ్యాపారికీ
పాలూ కూరగాయలతో పండగ పలకరింపు!
ఊరంతా వంటల సువాసనల పొగలు
తెలిమంచు పొరలతో పోటీగ నోరూరిస్తూ
క్రొత్త పంటల తొలి పండుగ పొంగళ్ళు!

మా దర్జీకి తీరికే వుండదు పండగన చెప్పాలా
కుట్టిన కాడికి తెచ్చి అమ్మతో బొత్తాలు కుట్టించి
తలంటా స్నానం జేసి కొత్త బట్టల్తో తయ్యారు!
పెద్దల పితృదేవతలకు తర్పణ అనంతరం
ఉమ్మడి కుటుంబమంతా విందుకు సిద్ధం!



మా ఊరి చెరువు తెప్పోత్సవానికి ముస్తాబు
మా ఇలవేల్పులు సీతారామలక్ష్మణులు
ఆంజనేయ సమేతంగా మేళతాళాలతో
ఊరి జనుల ఆశీర్వదించుటకు సిద్ధం!

ధన్యులు దేవుళ్ళ పల్లకీ వీధుల మోస్తుంటే
దేవుళ్ళేమో వీధుల రంగవల్లుల ఆస్వాదిస్తూ
రంగు రంగుల రథాలు నెమళ్ళు అబ్బురంగా
మైమరచి ఆ తన్మయత్వంలో చెరువుకి!

చెరువు చుట్టూర ప్రజలు పండగకి ముస్తాబై
అమ్మలక్కలు దేవుని కొలువ కొత్త కోడళ్ళతో
రాముడేమో ఏ ముగ్గులు ఏ రమణులు వేశారో
రమణుల రంగవల్లుల పోల్చుతూ సీతమ్మతో!

ఉత్సవ మూర్తుల ఊరేగించు భాగ్యము మాకూ
అంటూ ఎడ్ల గిత్తలు దేవుళ్ళ ఊరేగిస్తుంటే
రంగవల్లులపై తనివి తీరని సీతారాములు
ప్రతి ఇంటా ఆగి చూసి హారతులు గైకొని
వరాలిచ్చి అలసి సొలసి ప్రభాతాన గుడికి!

ప్రతి సారి ఒక్కో సంబరం ఊరేగింపు బండి వెనుక
ఓ సారి బుర్రకథ హరికథోసారి ఓ సారి రికార్డ్ డాన్స్!
మా ఊరి బడికాడ నాటకాల రెహర్సల్స్ సందడి
బోగిరోజాడిన పాండురంగ భజన తలచుకొంటూ!

తెప్పోత్సవ తిరుణాలె మా బొమ్మల కొలువులు
సఖుల చెరువున ముంచి తేల్చి కవ్వించుటే
మా పాలిట జూదమెయ్యని పందాలు పతంగులు!
కొత్త అల్లుళ్ళకు అళ్ళెము తయారిజేస్తూ అత్తలు
అయిన వాల్లందరిని పరిచయం జేస్తూ ఆలులు
బావలిచ్చిన గిప్టుల చూసి మురిసే బామ్మర్దులు
బ్రహ్మాండమైన ఈ ఉత్సవానికి తరించె మా ఊరు!



-రవి కిషోర్ పెంట్రాల
లాంగ్లీ, లండన్! (తవిక)

## కన్నవారి ఆందోళన

ఓ దేవా!
పట్నాలలో
చదువుతున్న
మాపిల్లలను
రక్షించు రక్షించు-
అరటాకు లాంటి
మనస్సు గల
వారి ముందు
ముళ్ల కంపలాంటి
రాజకీయ తూఫాను
అల్లరులు
అరాచకాలు
ధర్నాలు
మా పిల్లల చదువులు
చలించకుంటా
ఏ చిక్కుల
వలయంలో
చిక్కుకోకుంటా
కాపాడు దేవా!!



- యెల్ది సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067



యూసుఫ్‌గూడ-మధురానగర్‌లోని ఎం. ఈశ్వరయ్య ఆర్ట్ గ్యాలరీలో మహిలా చిత్రకారుల ప్రదర్శనను ఆదివారం సాయంత్రం పులువురు ఉన్నతులైన కళాకారులతో ఆవిష్కరించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు ఈ ఎగ్జిబిషన్‌లో 50 మందివరకు పాల్గొనగా, ప్రతి ఒక్కరూ రెండు ఎగ్జిబిట్లతో మొత్తం 100 చిత్రకళా ఖండాలను అక్కడ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 'కళారత్న' ప్రొఫెసర్ పీరాన్, గౌరవ అతిథిగా జేఎన్ఎఫ్ఏ యూఏ విభాగ అధిపతి ప్రీతి సంయుక్తా వెంగళరావు నగర్ వార్డు మెంబర్ ఎం. విజయ వాణి విచ్చేశారు.

ఆకలితీర్చుకున్న 'అహంకారం'
కొద్దిసేపు (దొంగ)వినయం ప్రదర్శిస్తుంది
ఆ తరవాతా (కపట)ప్రేమ ఒలకబోస్తుంది
అదో పెద్ద 'కొండచిలువ'
అరిషడ్వర్గం ప్రక్రియలతో
బాగా పొట్టనింపుకున్నాకా
ఏమాత్రం కదలలేని పరిస్థితి
అసలు విషయం

-మునిమడుగుల ఫిలాసఫీ.

## అమృతవర్షిణి అందుకున్న కేవీ




తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కే.వీ. రమణాచారికి శ్రీ త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి ఆధ్యాత్మిక రచయిత పురాణపండ శ్రీనివాస్ రాసిన "అమృత వర్షిణి" ఆధ్యాత్మిక గ్రంథం క్యాలెండర్‌ను అందజేశారు. వంశీ సంస్థ ఆదివారం గానసభ ప్రధాన ఆడిటోరియంలో రెండు సెషన్లలో నిర్వహించిన శివశంకరి గీతాల విభావరి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రమణాచారి హాజరైనారు. ఈ సందర్భంగా రచయితకు కేవీ శుభాకాంక్షలు తెలిపారు. వంశీసంస్థల అధినేత వంశీరామరాజు, సమాజ సేవకుడు సుబ్బారావు బి. పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



ఆదివారం తెలంగాణ ఫోటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రంలో సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కన్వీనర్ శైలెంధర్, జగదీష్‌గౌడ్, జంగారెడ్డి, ఆనంద్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

## "అంకెల మధ్య సాహితీ సౌరభాలు"




ఈరోజు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఏజీ ఆఫీసు రంజని ,తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో జరిగిన 2019 రంజని-రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక కథానిక పోటీల విజేతలకు ప్రముఖ కథకులు ,శ్రీ ఆకెళ్ల ,మరియు సాహితీవేత్త శ్రీ సుధామ ల చేతులమీదుగా బహుమతి ప్రదానం జరిగింది. ఈసభలో శ్రీ సుధామ మాట్లాడుతూ కేవలం అంకెల మనుషులు మాత్రమే కాదు, మానవీయ గణకులు వీరు. తెలుగు సాహిత్యంలో 'రంజని' ప్రేరణగా ఎన్నో సంస్థలు స్థాపించబడ్డాయి. భాషేమైపోతుందో అన్న ఆర్తి గురించి పునర్మూల్యాంకన చేయాలనిపిస్తోంది. రచయితలకు భాధ్యత ఉంది. భాషలేకపోతే సాహిత్యం ఉండదు. మాండలికాన్ని నిలబెట్టుకోవాలి. అవసరం లేనప్పుడు ఆంగ్లం వాడకం ,మాట్లాడటం జరుగుతోంది. భాష నిలబడాలన్నా - మాట్లాడటం ,చదవడం, రాయడం, ఆలోచించడం కావాలి. పాతతరాలు తీర్చిదిద్దిన తెలుగు నేడు ప్రమాదం లో పడింది అని ఆవేదన వ్యక్తం చేశారు. మరొక వక్త శ్రీ ఆకెళ్ల మాట్లాడుతూ ఏజీ ఆఫీస్ లో అనేక మంది నటులు ,రచయితలున్నా రు...ఎంత మందినో సాహితీవేత్తలను ఈఆఫీస్ తయారు చేసిందన్నారు. ఇదే కార్యక్రమంలో సీనియర్ కథకులు శ్రీ వసుంధర మాట్లాడుతూ కథ ఒక ప్రవాహం, నిత్యనూతనంగా, స్వచ్ఛంగా ఉంటుంది. భాషని నిలబెట్టడానికి పత్రికలు పుణ్యస్థలాలు. కథ ఒక చరిత్ర కాకూడదని .నిత్యానుష్టానం కావాలన్నారు తద్వారా తెలుగు భాషను సుసంపన్నం చేసుకోవచ్చు నని చెప్పారు. సభాప్రారంభానికి ముందు శ్రీ నాగరాజు, సత్యనారాయణ లు తెలుగు భాషౌన్నత్యాన్ని చాటిచెప్పే గీతాలాపన చేయగా ,సభా కార్యక్రమంలో ముందుగా రంజని ప్రధాన కార్యదర్శి శ్రీ మట్టిగుంట వెంకటరమణ మాట్లాడుతూ కీ.శే. రాయప్రోలు రామకృష్ణయ్య సాహితీ వ్యక్తిత్వ విశేషాలను వివరించారు. అధ్యక్షులు శ్రీమతి పద్మలతా జయరాం ఆహూతులకు అతిథులను పరిచయం చేయగా, ఇంకా కార్యక్రమంలో ప్రముఖ కథకులు శ్రీ నడిమింటి జగ్గారావు ,రంజని ఉపాధ్యక్షులు శ్రీ అద్దేపల్లి రాధాకృష్ణ, కోశాధికారి నంద్యాల మురళీకృష్ణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

